RNI No Tel / 2012 /4241

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..

# హైదరాబాద్ ఎస్టేట్

తెలుగు దిన పత్రిక

THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER

hyderabadestate.co.in

సంపుటి : 13 సంచిక : 272 | గురువారం, మార్చి 12 2026 | ఎడిటర్ : బట్టు లక్ష్మీనారాయణ, | పేజీలు : 6 వెల : రూ. 5.00

Hyderabad, Vijayawada, Vishakapatnam Tirupathi, Ananthapuram, Guntur, Nellor, Ongole, kadapa, Medak, Sangareddy, Siddipet, Nalagonda, Karimnagar,

## ట్రాఫిక్ ఫ్రీ నగరంగా హైదరాబాద్ అభివృద్ధి

- తెలంగాణ రూపురేఖలు మార్చేలా రవాణా, వైద్యరంగం అభివృద్ధి
- 'రోడ్ సెక్టార్ పాలసీ-2047' లక్ష్యంగా కీలక ఆదేశాలు
- అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా రవాణా వ్యవస్థ
- హైదరాబాద్ నుంచి రోడ్డు కనెక్టివిటీ పెంచాలి
- రోడ్ల విస్తరణ పనులు త్వరగా చేపట్టాలి
- రాష్ట్రంలోని ప్రధాన జిల్లా కేంద్రాలన్నింటికీ ఒక రింగ్ రోడ్డు
- నిర్మాణంలో ఉన్న ఆస్పత్రులను త్వరగా పూర్తి
- అధికారులతో సమీక్షలో సిఎం రేవంత్ ఆదేశం



**హైదరాబాద్,మార్చి 11 :**తెలంగాణ రాష్ట్ర రూపురేఖలను మార్చే విధంగా, భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా రవాణా, వైద్య రంగాల్లో భారీ మార్పులకు సీఎం రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టారు. అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో 'రోడ్ సెక్టార్ పాలసీ–2047' లక్ష్యంగా కీలక ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలో రవాణా వ్యవస్థను అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా తీర్చిదిద్దాలని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్ నగరం నుంచి రాష్ట్రంలోని ఏ ప్రాంతానికైనా నిర్ణీత సమయంలో చేరుకునేలా రోడ్ల నెట్ వర్క్ ను అభివృద్ధి చేయాలని అన్నారు. నగరంలో పెరుగుతున్న వాహనాల సంఖ్యతో వీపరీతమైన ట్రాఫిక్ జామ్ ఏర్పడుతోంది. మిగతా2లో...

## పశ్చిమాసియా యుద్ధంపై రాజకీయాలా..?

- కాంగ్రెస్, కమ్యూనిస్టుల తీరుపై మండిపడ్డ ప్రధాని
- గల్ఫ్‌లో చిక్కున్న వారిని ఇండియాకు తీసుకుని వస్తున్నాం
- అక్కడి ప్రభుత్వాలు భారత్‌కు అండగా నిలిచాయి
- రాహుల్‌కు అభివృద్ధి గురించి తెలియదు
- విమర్శించడమే రాహుల్‌కు తెలిసిన పని
- కేరళం పర్యటనలో మోడీ గాటు విమర్శలు



**తిరువనంతపురం,మార్చి 11 :** ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీతోపాటు ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీపై ప్రధాని నరేంద్ర మోదీ విమర్శలు సంధించారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ బాధ్యతా రహితంగా మాట్లాడుతున్నారని ప్రధాని మోదీ మండిపడ్డారు. దేశ యువతపై ఆయనకు అవగాహన లేదంటూ రాహుల్ తీరును ఎండగట్టారు. కాంగ్రెస్ యువరాజుకి ఏమీ తెలీదంటూ ఆయనపై పరోక్ష విమర్శలు చేశారు. దేశ అభివృద్ధిని కాంగ్రెస్ యువరాజు చూడలేక పోతున్నారంటూ రాహుల్ తీరుపై మండిపడ్డారు. బుధవారం కేరళంలోని ఎర్నాకులంలో ప్రధాని మోదీ పర్యటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రధాని మోదీ మాట్లాడుతూ.. యుద్ధం పేరుతో తనను కాంగ్రెస్ పార్టీ దూషిస్తోందని తెలిపారు. ఇరాన్, ఇజ్రాయెల్ యుద్ధంపై కాంగ్రెస్, వామపక్షాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని పేర్కొన్నారు. గల్ఫ్‌లో భారతీయులు చిక్కుకోవాలని కాంగ్రెస్ పార్టీ కోరుకుంటుందన్నారు. ఆయా దేశాల్లోని భారతీయులను కాపాడేందుకు కేంద్రం అన్ని ఏర్పాట్లు చేస్తుందని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. ఇక ఈ పర్యటనలో పలు ప్రాజెక్టులకు ప్రధాని మోదీ శంకుస్థాపనలు చేశారు. అలాగే వివిధ పథకాలను ఆయన ప్రారంభించారు. ప్రస్తుత సంక్షోభ సమయంలో విదేశాల్లో చిక్కుకున్న భారతీయుల్ని ఇండియాకు తీసుకొస్తామని, ఏ ఒక్కరినీ వదిలిపెట్టేది లేదని ప్రధాని మోదీ అన్నారు. ఒకవైపు ప్రపంచం సంక్షోభంలో ఉంటే కాంగ్రెస్ పార్టీ రాజకీయం చేస్తోందని మోదీ విమర్శించారు. త్వరలో కేరళం అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో మిగతా2లో...

## వెలుగుమట్లలో మోడల్ కాలనీ నిర్మిస్తాం

- డిసెంబర్ 9లో కాలనీ నిర్మాణం పూర్తి
- సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశం
- రాష్ట్రంలో ప్రతి పేదవానికి ఇల్లు మా ప్రభుత్వ లక్ష్యం
- నాలుగున్నర లక్షల ఇళ్ల నిర్మాణానికి 22,500 కోట్లు
- వెలుగుమట్ల బాధితులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేసిన భట్టి



**ఖమ్మం,మార్చి 11 :** కాంగ్రెస్ సర్కారు పేదల గురించి ఆలోచించే ప్రభుత్వమని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఈ రాష్ట్రంలో ఏ ఒక్క పేద కూడా గూడు ఉండకూడదని నిర్ణయించి ఇందిరమ్మ ఇల్ల పథకం అమలు చేస్తున్నామని అన్నారు. ఖమ్మం జిల్లా వెలుగుమట్ల భూదాన్ భూమిలో అర్హులకు ఇళ్ల స్థలాలు, మిగతా2లో...

## లోక్‌సభలో స్పీకర్‌పై వీగిన అవిశ్వాసం

- మూజువాణి ఓటుతో తిరస్కరించిన సభ
- రెండ్రోజుల పాటు సభలో సుదర్ఘంగా చర్చ
- విపక్షాల తీరుపై మండిపడ్డ అమిత్ షా
- స్పీకర్‌ను అవమానించడం తగదని కాంగ్రెస్‌కు హితవు
- ఓటింగ్ అనంతరం సభ నేటికి వాయిదా



2లో

## అమరావతిలో భారీ అగ్నిప్రమాదం

- ఎల్ అండ్ టి స్టాక్ పాయింట్‌లో పైపులు దగ్ధం
- సకాలంలో మంటలను ఆర్పిన ఫైర్ సిబ్బంది



2లో

## తెలంగాణ గవర్నర్‌గా శివప్రతాప్ శుక్లా

● రాజ్‌భవన్‌లో తెలుగులో ప్రమాణం ● సిఎం రేవంత్ తదితరుల హాజరు



**హైదరాబాద్,మార్చి 11 :** తెలంగాణ నూతన గవర్నర్‌గా శివప్రతాప్ శుక్లా ప్రమాణ స్వీకారం చేశారు.. తెలుగులో ప్రమాణం చేయడం ఆసక్తిగా మారింది. లోక్‌భవన్‌లో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు హాజరయ్యారు. ముందుగా పూర్తి వందేమాతరం గేయంతో కార్యక్రమం ప్రారంభమైంది. అనంతరం మంత్రులతో కలసి గవర్నర్ గ్రూప్ ఫోటో దిగారు. ఇక శివ్ ప్రతాప్ శుక్లా విషయానికి వస్తే.. ఆయన 73 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ నేపథ్యం కలిగిన నేత. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఆయన, ఏబీవీపీ ద్వారా రాజకీయాల్లోకి ఎంట్రీ ఇచ్చారు. ఎమర్జెన్సీ సమయంలో జైలుకు సైతం వెళ్లారు. యూపీలో నాలుగుసార్లు ఎమ్మెల్యేగా, కేబినెట్ మంత్రిగా, కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రిగా పనిచేశారు. 2023–2026 మధ్య హిమాచల్ ప్రదేశ్ గవర్నర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. తాజాగా తెలంగాణకు విచ్చేశారు.






## నా... మాట!

అలసిపోయిన నీ దేహం స్మశానం వైపు,
నలుగురు మోసే పాడేపై ఊరేగుతూ వెళుంది..సచ్చిన శవానికి స్నానం పోయించి,
నీ మొఖానికి కుంకుమ బొట్టు పెట్టి,
కొత్త బట్టలు,నిండుగా చూట్టి..
పాడేపై పండుకోబెట్టి,గోవిందా
నామస్మరణలతో, ఆకాశానికి నీ మొఖన్ని
చూపిస్తూ,అరచేతిలను తెరిచి ఉంచి,
టాపాసుల శబ్దలతో,డప్పు చప్పుళ్ల మధ్య,
నీ శవయాత్ర,దుఃఖంలో కొనసాగుతుంది..
నువ్వు సంపాదించిన ఆస్తులు,
నువ్వు కట్టుకున్నా కోట మేడలు,
నిన్ను పరిహాసంగా చూస్తున్నాయి..
నీ జీవితంలో సంపాదించుకున్నా,
అప్పులు మాత్రమే నీ ఊరేగింపులో
పాల్గొన్నారు..నీకోసం రెండు కన్నీళ్ల
చుక్కలు కార్చే వ్యక్తులు, నీ పాడే
మోస్తున్నారు.. నీకోసం కట్టెలతో కట్నాం
పేర్చి, నిన్ను తాగులబెట్టేందుకు అగ్గిపెట్టె
పట్టుకుని నీల్చున్నారు..
ఐనా వళ్ళెవరు,కానీ వాళ్ళు ఏవరో,
చుస్కోవడానికి నీకు ప్రాణం లేదాయె!
బ్రతికనాన్ని రోజులు,స్వార్థంతో డబ్బు
సంపాదన కోసమే జీవించావు!
ఐనా వాళ్ళకు దమ్మిడి సాయం
చేయకపోతివి,
కట్టుకున్నా దాన్ని,కడుపులో పుట్టిన
పిల్లలను
ఏనాడూ సుఖ పెట్టాకపోతివి,నీది ఎన్నెండ్ల
జీవితమో కానీ,ఒక్కరోజుతో ముగిసిపాయే!

పెద్దపల్లి రాజన్న...
9848174314

## తెలంగాణ రైతు పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ ..చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా ముషారఫ్ అలీ ఫరూఖీ

వ్యవసాయ రంగానికి కొత్త డిస్కమ్ ఏర్పాటు చేసిన ప్రభుత్వం



**హైదరాబాద్,మార్చి 11 :** తెలంగాణ ప్రభుత్వం విద్యుత్ పంపిణీ వ్యవస్థను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు రాష్ట్రంలో మూడో డిస్కమ్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇప్పటికే పనిచేస్తున్న టీజీఎస్పీ డీసీఎల్, టీజీఎన్‌పీడీసీఎల్ సంస్థలకు అదనంగా కొత్త డిస్కమ్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. మిగతా2లో...

RNI No Tel / 2012 /4241

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..

# హైద్రాబాద్ ఎస్టేట్

THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER

తెలుగు దిన పత్రిక

## పశ్చిమాసియా యుద్ధంపై రాజకీయాలా..?

(మొదటి పేజీ తరువాయి)

మోదీ అక్కడి కార్యక్రమానికి హాజరయ్యారు. కీలక ప్రసంగం చేశారు. విదేశాల్లో చిక్కుకున్న భారతీయుల్ని వదిలిపెట్టబోం. వారిని ఇండియాకు తీసుకొస్తాం. పశ్చిమాసియా సంక్షోభంలో మిగిలిపోయిన భారతీయులకు తగిన సాయం అందిస్తున్నాం. వాళ్ల క్షేమం, సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం. గల్ఫ్ కంట్రీస్‌లో ఉన్న భారతీయుల రక్షణ కోసం చర్యలు తీసుకుంటున్న అక్కడి ప్రభుత్వాలకు కృతజ్ఞతలు. మనవారి సేవలు గుర్తించి, తగిన సహా యం అందిస్తున్నాయి అక్కడి ప్రభుత్వాలు. ఆయా దేశా ల్లోని భారతీయ రాయబార కార్యాలయాలు కూడా నిరంతరం పని చేస్తున్నాయి. ఒకవైపు ప్రపంచం సంక్షోభంలో ఉంటే కాంగ్రెస్ పార్టీ దీనిపై రాజకీయం చేస్తోంది. రెచ్చగొట్టేలా, బాధ్యతారాహిత్యమైన ప్రకటనలు చేస్తోంది. విదేశాల్లో ఉన్న భారతీయుల విషయంలో రాజకీయం చేయడం తగదన్నారు. ఒకవైపు ప్రభుత్వం నిరంతరం పని చేస్తుంటే ఈ అంశంలో రాజకీయ లబ్ది కోసం కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది. డ్రోన్ల తయారీలో దేశ యువత సాధిస్తున్న విజయాల గురించి కాంగ్రెస్ యువరాజు కి అవగాహన లేదు. కేరళ సహా అనేక రాష్ట్రాల్లోని స్టార్టప్‌లు డ్రోన్లు తయారు చేస్తున్నాయి. సంకుచిత మనస్తత్వం గలవారు ఇలాంటి దేశ ప్రగతిని చూడలేరు. బీజేపీ ఆధ్వర్యంలోని ఎన్డీయే కూటమికి కేరళలో ఒక్కసారి అవకాశం ఇవ్వండి. అభివృద్ధి అంటే ఎలా ఉంటుందో చూపిస్తాం. రాష్ట్రం పేరును కేరళ నుంచి కేరళంనకు మార్చినందుకు ఆనందంగా ఉంది. గత ప్రభుత్వాలు కేరళకు ఏమీ చేయలేదని మోదీ అన్నారు. ఈ పర్యటన అనంతరం తమిళనాడులో ప్రధాని మోదీ పర్యటించనున్నారు. ఈ సందర్భంగా ఆ రాష్ట్రంలో పలు అభివృద్ధి పథకాలకు ఆయన శంకుస్థాపన చేయనుండడంతోపాటు వివిధ పథకాలను ప్రారంభించనున్నారు. ఈ రెండు రాష్ట్రాల్లో ప్రధాని మోదీ పర్యటన సందర్భంగా కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశారు. మరికొద్ది రోజుల్లో తమిళనాడు, కేరళలతోపాటు అసోం, మేఘాలయా, పుదుచ్చేరి అసెంబ్లీలకు మార్చి నుంచి మే మాసాల మధ్య ఎన్నికల నగారా మోగనుంది. దీంతో ఆయా రాష్ట్రాల్లో అధికారం అందుకోవాలని బీజేపీ, కాంగ్రెస్‌తో పాటు వామపక్ష పార్టీలైన కమ్యూనిస్టు పార్టీ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నాయి. ఆ క్రమంలో ప్రధాని మోదీ బుధవారం కేరళ, తమిళనాడుల్లో పర్యటిస్తున్నారు. పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నారు.

## ట్రాఫిక్ ఫ్రీ నగరంగా హైదరాబాద్ అభివృద్ధి

(మొదటి పేజీ తరువాయి)

ట్రాఫిక్ కష్టాల నుంచి విముక్తి చేయడానికి కనెక్టివిటీ రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్య ఇవ్వాలని ఆదేశించారు. ఇప్పటికే గుర్తించిన ప్రాంతాలలో పనులను తక్షణమే ప్రారంభించాలని అధికారులకు సూచించారు. రాష్ట్రంలోని ప్రధాన జిల్లా కేంద్రాలన్నింటికీ ఒక రింగ్ రోడ్డు నిర్మించి, వాటిని జాతీయ రహదారులతో అనుసంధానించాలని సీఎం తెలిపారు. దీని వల్ల జిల్లాల ఆర్థికాభివృద్ధి వేగవంతం అవుతుందని ఆయన ఆకాంక్షించారు. రోడ్ల అభివృద్ధి పనుల్లో భూ సేకరణ వంటి అడ్డంకులు కలగకుండా జిహెచ్ఎంసి, రెవెన్యూ విభాగాల మధ్య పూర్తి సమన్వయం ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. రోడ్ సెక్టార్ పాలసీ-2047 కు అనుగుణంగా రాష్ట్రంలో రోడ్ల అభివృద్ధికి సంబంధించి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సమీక్షా సమావేశంలో అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ నగరం నుంచి రాష్ట్రంలో ఎక్కడికైనా నిర్ణీత సమయంలో చేరుకునేలా రోడ్ల అభివృద్ధి జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. హైదరాబాద్ నగరాన్ని ట్రాఫిక్ ఫ్రీ నగరంగా తీర్చిదిద్దడానికి కనెక్టివిటీ రోడ్ల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలను గుర్తించాలన్నారు. ఇప్పటికే గుర్తించిన ఏరియాలలో రోడ్ల అభివృద్ధి పనులు మొదలు పెట్టేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సిఎం అన్నారు. క్షేత్రస్థాయిలో సమస్యలు తలెత్తకుండా స్పష్టమైన కార్యాచరణతో ముందుకు వెళ్లాలని, దీనిపై సాధ్యాసాధ్యాలు నిశితంగా అధ్యయనం చేయాలని సమీక్షా సమావేశంలో అధికారులను ఆదేశించారు. ఇక పేద ప్రజలకు అత్యాధునిక వైద్యం చేరువ చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి అన్నారు. రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న అన్ని టీచింగ్ హాస్పిటల్స్, పెద్ద ఆసుపత్రుల పనులను సత్వరమే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రులలో మౌలిక సదుపాయాలను మెరుగు పరిచి, పేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా చూడాలని స్పష్టం చేశారు. పేదలకు మరింత మెరుగైన వైద్యసేవలు అందుబాటులోకి తెచ్చేందుకు వీలుగా హాస్పిటల్స్ భవనాల నిర్మాణం వేగంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ మేరకు సమీక్షలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## వెలుగుమట్లలో మోడల్ కాలనీ నిర్మిస్తాం

(మొదటి పేజీ తరువాయి)

ఇందిరమ్మ ఇళ్ల పట్టాలను భట్టి బుధవారం పంపిణీ చేశారు. మంత్రులు పొంగులేటి, తుమ్మలత కలసి ఆయన స్థల పట్టాలు అందచేశారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. పేదలందరికీ ఇల్లు ఉండాలనేది తమ ఆశయం అన్నారు. తొలి ఏడాదే 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టినట్లు గుర్తుచేశారు. ఇళ్లు మంజూరు చేయడంతో పాటు.. నిర్మాణాన్ని పర్యవేక్షిస్తూ ఎప్పటికప్పుడు బిల్లులు మంజూరు చేస్తున్నట్లు వివరించారు. పేదల నిస్సహాయతను అడ్డుగా పెట్టుకుని కొందరు రాజకీయాలు చేశారు. అమాయకులను మోసం చేసి రూ.లక్షల్లో వసూలు చేశారు. పదేళ్లు అధికారంలో ఉన్న పార్టీ వెలుగుమట్ల పేదలకు నీరు, విద్యుత్ సౌకర్యం ఎందుకు కల్పించలేదని భట్టి ప్రశ్నించారు. ఇక్కడి పేదలను కొందరు మోసం చేస్తున్నారని కోర్టు చెప్పింది. మేం మానవీయ కోణంలో వెలుగుమట్ల పేదలకు న్యాయం చేస్తున్నాం. అర్హులకు స్థలంతో పాటు.. ఇంటి నిర్మాణం చేసి ఇస్తున్నాం. 412 మందిని అధికారికంగా గుర్తించి, పట్టాలు ఇచ్చి న్యాయం చేస్తున్నాం అన్నారు. ఇన్నాళ్లు వెలుగుమట్ల పేదలను ఎందరో వచ్చి బెదిరించారు. ఇకపై వీరిని ఎవరూ బెదిరించలేరు.. డబ్బు వసూలు చేయలేరు. ఇకపై వారు నిర్భయంగా బతకవచ్చు. పట్టాలు పొందిన వారు రేపటి నుంచే తమ ఇళ్ల నిర్మాణం ప్రారంభించాలని భట్టి విక్రమార్క చెప్పారు.వెలుగుమట్లలో పేదల కోసం మోడల్ కాలనీ నిర్మిస్తాం, దేశంలోని ఇతర రాష్ట్రాల వారు వచ్చి చూసే విధంగా మోడల్ కాలనీ నిర్మాణం జరుగుతుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. వెలుగుమట్లలో పేదలకు పంచగా మిగిలిన 16 ఎకరాల భూమిని తెలంగాణ పబ్లిక్ స్కూల్, ఇతర ప్రభుత్వ విద్యా సంస్థల నిర్మాణానికి ఉపయోగిస్తాం అన్నారు. భూదాన్ భూముల్లో పేదలకు ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ఇవ్వడమే కాదు కరెంటు, నీళ్లు, రోడ్లు, ఆసుపత్రి, కమ్యూనిటీ హాల్, షాపింగ్ కాంప్లెక్స్ అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. గురువారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ప్రారంభించండి డిసెంబర్ 9 కల్లా మోడల్ కాలనీలో ఇళ్ల నిర్మాణం పూర్తి కావాలి అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశిస్తున్నాను, ముగ్గురు మంత్రులము కలిసి సీఎం రేవంత్ రెడ్డిని ఆహ్వానిస్తాం డిసెంబర్ 9 కల్లా నిర్మాణం పూర్తి చేయాలి పాలు పొంగించాలి, సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా గృహప్రవేశాలు జరగాలని డిప్యూటీ సీఎం అధికారులకు సూచించారు. ఇది పేదల పక్షాన మాకు ఉన్న నిబద్ధత అన్నారు. ఇల్లు కట్టిస్తామని పది సంవత్సరాలపాటు పరిపాలించిన వారు చెప్పిన మాటలు నమ్మి చూసి చూసి పేదల కళ్ళు కాషాయని, వారు ఒక్క ఇల్లు కూడా పంపిణీ చేయలేదని తెలిపారు. అలాంటి వారికి మా ప్రభుత్వాన్ని విమర్శించే హక్కు లేదన్నారు. ఈ రాష్ట్రంలో జీవించే ప్రతి పేదవానికి ఇందిరమ్మ ఇల్లు నిర్మించాలి అనేది సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని క్యాబినెట్ ఆలోచన అన్నారు. ఆ ఆలోచనలో భాగంగానే రాష్ట్రంలో పేదవారి కోసం నాలుగున్నర లక్షల ఇందిరమ్మ ఇల్లు నిర్మించేందుకు 22,500 కోట్లు ఒకేసారి మంజూరు చేసి చేసే చరిత్రలోనే రికార్డు సృష్టించిన ప్రభుత్వం తమది అనే డిప్యూటీ సీఎం తెలిపారు. కోర్టు తీర్పు మేరకే ఇక్కడి భూముల్లో ఉన్నవారిని కలెక్టర్ ఖాళీ చేయించాల్సి వచ్చిందన్నారు. ఖాళీ చేయించే సమయంలో పేదలపై ఒక్క లాఠీ దెబ్బ పడొద్దని చెప్పామన్నారు. భూదాన్ భూములను ఎప్పటికైనా పేదలకే ఇవ్వాలని నిర్ణయించినట్లు వివరించారు.ఏ జిల్లా వారైనా సరే.. ఇంటి స్థలం లేకుంటే ఇంటి పట్టాలు ఇస్తున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. వెలుగుమట్లలో 412 మందికి న్యాయం చేస్తున్నామన్నారు. ఇక్కడి భూదాన్ భూముల్లో 311 మందికి ఇళ్ల స్థలాలు ఇస్తున్నట్లు చెప్పారు. మరో 101 మంది తమకు సొంత స్థలం ఉందని.. ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని అడిగారని వివరించారు. వెలుగుమట్ల భూముల విషయంలో కొందరు మొసలి కన్నీరు కార్చారు.

పదేళ్లు అధికారంలో ఉండి పేదలకు ఇంటి పట్టాలు ఎందుకు ఇవ్వలేదు? పేదల పట్ల జాలి ఉంటే వారికి సాయం ఎందుకు చేయలేదు. మళ్లీ అధికారంలోకి వస్తామని కొందరు పగటి కలలు కంటున్నారు. పేదల కష్టాలు తెలిసిన నిజమైన ప్రజా ప్రభుత్వం మాది. వెలుగుమట్లలో అన్ని మౌలిక వసతులను కల్పిస్తాం. లబ్దిదారుల ఇళ్ల నిర్మాణం కంటే ముందే సదుపాయాలు పూర్తి చేస్తాం‘ అని పొంగులేటి అన్నారు.

## తెలంగాణ రైతు పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ .. చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా ముషారఫ్ అలీ ఫరూఖి

(మొదటి పేజీ తరువాయి)

ఈ కొత్త సంస్థకు తెలంగాణ రైతు పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ అనే పేరు పెట్టారు. దీనిని సాధారణంగా 'రైతు డిస్కమ్'గా కూడా పిలుస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం.. ఈ సంస్థను కంపెనీస్ యాక్ట్ 2013 ప్రకారం నమోదు చేయనున్నారు. హైదరాబాద్‌లోని మింట్ కంపౌండ్ ప్రాంతంలో ఈ సంస్థ ప్రధాన కార్యాలయం ఏర్పాటు చేయనున్నారు. విద్యుత్ పంపిణీ వ్యవస్థలో పెరుగుతున్న అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఈ కొత్త సంస్థను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. ఈ కొత్త డిస్కమ్‌కు ఐఏఎస్ అధికారి ముషారఫ్ అలీ ఫరూఖీను చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా నియమించారు. విద్యుత్ రంగంలో ఆయనకు ఉన్న పరిపాలనా అనుభవాన్ని దృష్టిలో ఉంచుకుని కొత్త సంస్థ నిర్వహణ బాధ్యతలను ప్రభుత్వం ఆయనకు అప్పగించింది. 'రైతు డిస్కమ్' ప్రధానంగా వ్యవసాయ రంగానికి సంబంధించిన విద్యుత్ సరఫరాను చూసుకుంటుంది. వ్యవసాయ కనెక్షన్లు, లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలు, మిషన్ భగీరథ వంటి తాగునీటి పథకాల కోసం అవసరమైన విద్యుత్ సరఫరాను ఈ సంస్థ నిర్వహించనుంది. అలాగే హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు (ఊఓచాః) అవసరాలకు కూడా విద్యుత్ అందించే బాధ్యత ఈ సంస్థపై ఉంటుంది.ఈ సంస్థ ద్వారా కొత్త వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఇవ్వడం, విద్యుత్ కొనుగోలు చేసి సరఫరా చేయడం, ట్రాన్స్‌ఫార్మర్లు , విద్యుత్ లైన్‌ల నిర్వహణ వంటి పనులు చేపడతారు. అదేవిధంగా విద్యుత్ వినియోగాన్ని లెక్కించడం, మీటర్ల నిర్వహణ చేయడం, వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడం వంటి బాధ్యతలను కూడా ఈ సంస్థ నిర్వర్తిస్తుంది. కొత్త సంస్థ బోర్డు ఆఫ్ డైరెక్టర్లలో విద్యుత్ శాఖకు చెందిన పలువురు అధికారులు సభ్యులుగా ఉంటారు. వీరిలో తిరుపతి రెడ్డి, పీ. కృష్ణారెడ్డి, వంగూరు మోహన్ రావు, ఎన్. నరసింహులు వంటి అధికారులు డైరెక్టర్లుగా నియమించబడ్డారు. రాష్ట్రంలో వ్యవసాయ రంగానికి ఉచిత విద్యుత్ సరఫరా, భారీ సాగునీటి ప్రాజెక్టులు పెరుగుతున్న నేపథ్యంలో విద్యుత్ పంపిణీ వ్యవస్థపై భారం పెరుగుతోంది. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వ్యవసాయానికి సంబంధించిన విద్యుత్ సరఫరాను ప్రత్యేకంగా నిర్వహించేందుకు 'రైతు డిస్కమ్'ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

## హాస్టళ్లపై గ్యాస్ సరఫరా ఎఫెక్ట్

- తగ్గిన ఫుడ్ ఐటమ్స్ సరఫరా

**హైదరాబాద్,మార్చి 11 :** మిడిల్ ఈస్ట్‌లో యుద్ధ ప్రభావం హైదరాబాద్‌లోని హాస్టల్స్‌పై పడింది. ఇరాన్- ఇజ్రాయెల్ ఉద్రిక్తతల మధ్య గ్యాస్ సంక్షోభం వాటిల్లిన విషయం తెలిసిందే. దీంతో ప్రస్తుత హాస్టల్స్‌కు గ్యాస్ సరఫరా తగ్గింది. ఐటీ కారిడార్‌లో గ్యాస్ సరఫరా తగ్గడంతో ఫుడ్ ఐటమ్స్ తగ్గించారు. కమర్షియల్ గ్యాస్ సరఫరా నిలవడంతో హాస్టల్ యాజమాన్యాలు ఆందోళనలో ఉన్నాయి.. ఈ అంశంపై హాస్టల్ అసోసియేషన్ ప్రతినిధులు స్పందించారు. కమర్షియల్ గ్యాస్ సరఫరా నిలిచిందని.. కావల్సినంత గ్యాస్ సరఫరా లేదన్నారు.. ప్రస్తుతం నగరంలో పదకొండు వేల హాస్టల్స్ ఉన్నాయని.. లక్షల మంది హాస్టల్స్‌లో ఉన్నారన్నారు.. ఎడ్యుకేషన్.. హాస్పిటల్‌కు సంబంధించిన హాస్టల్స్‌కు గ్యాస్ సరఫరా చేస్తున్నారని చెప్పారు.. ‘కమర్షియల్ గ్యాస్ ఇవ్వకుంటే.. డొమెస్టిక్ గ్యాస్ రోజుకి ఒకటైన ఇవ్వాలని కోరారు.. అధికారులతో మాట్లాడాం.. రెస్పాన్స్ లేదు.. గ్యాస్ ఎక్కువగా కన్సంప్షన్ అయ్యే ఫుడ్ ఐటమ్స్ తగ్గిస్తున్నాం.. చపాతి దోశ వంటి ఐటమ్స్ తగ్గిస్తామని చెప్పాం.. హాస్టల్స్ మూసేసే పరిస్థితి రాదని అనుకుంటున్నాం..‘ అని హాస్టల్ యాజమాన్యాలు వెల్లడించాయి.

## అమరావతిలో భారీ అగ్నిప్రమాదం

**అమరావతి,మార్చి 11 :** రాజధాని ప్రాంతంలో అగ్నిప్రమాదం కలకలం రేపింది. వెలగపూడి ఎన్ 9 జంక్షన్ వద్ద ఉన్న ఎల్ అండ్ టి స్టాక్ పాయింట్‌లో బుధవారం మంటలు చెలరేగాయి. అక్కడ నిల్వ ఉంచిన భారీ పైపులు ఒక్కసారిగా మంటలకు ఆహుతయ్యాయి. మంటలు వేగంగా వ్యాపించడంతో ఆ ప్రాంతం మొత్తం పొగతో కమ్ముకుంది. పెద్ద ఎత్తున పొగలు ఎగసిపడటం గమనించిన స్థానికులు వెంటనే అధికారులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వెంటనే ఫైర్ సిబ్బంది, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. భారీ మంటలు ఎగసిపడటంతో అగ్నిమాపక సిబ్బంది అప్రమత్తంగా చర్యలు చేపట్టారు. ÷ర్ ఇంజిన్ల సహాయంతో మంటలను అదుపులోకి తీసుకురావడానికి ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. పైపులు, ఇతర సామగ్రి ఉండటంతో మంటలు అదుపు చేయడం కొంత కష్టంగా మారినట్లు అధికారులు చెబుతున్నారు. మరోవైపు అగ్నిప్రమాదం కారణంగా ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని ప్రాథమిక సమాచారం. అయితే భారీగా నిల్వ ఉంచిన పైపులు కాలిపోవడంతో ఆస్తి నష్టం జరిగినట్టు అంచనా వేస్తున్నారు. మంటలు ఎలా చెలరేగాయన్నదానిపై అధికారులు విచారణ ప్రారంభించారు. షార్ట్ సర్క్యూట్ కారణమా లేక ఇతర కారణాల వల్లా అగ్నిప్రమాదం జరిగిందా అనే కోణంలో పరిశీలిస్తున్నారు. అగ్నిప్రమాదం జరిగిన ప్రాంతానికి సమీపంలో వాహనాల రాకపోకలను తాత్కాలికంగా పోలీసులు నిలిపివేశారు. ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. మంటలను పూర్తిగా అదుపులోకి తీసుకువచ్చే వరకు అగ్నిమాపక సిబ్బంది అక్కడే మోహరించి చర్యలు కొనసాగిస్తున్నారు. వెలగపూడి ప్రాంతంలో కొంతసేపు ఆందోళన వాతావరణం నెలకొంది.

## ఆ ఇద్దరూ బిఆర్ఎస్ ఎమ్మెల్యేలే..

**హైదరాబాద్,మార్చి 11 :** పార్టీ మారాన్ని పదిమంది ఎమ్మెల్యేల ఫిరాయింపుల కేసును స్పీకర్ మొత్తంగా కొట్టివేశారు. తాజాగా ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిలపై దాఖలైన అనర్హత పిటిషన్లపై తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ సంచలన తీర్పు ఇచ్చారు. ఈ ఇద్దరు ఎమ్మెల్యేలపై వేసిన అనర్హత పిటిషన్లను స్పీకర్ డిస్మిస్ చేశారు. వీరు పార్టీ మారినట్లు ఆధారాల్లేవని.. ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరి ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా వారిద్దరూ బీఆర్ఎస్ పార్టీలో ఉన్నట్లు స్పీకర్ ప్రకటించారు. దానం నాగేందర్, కడియం శ్రీహరి 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున ఎమ్మెల్యేలుగా గెలిచిన విషయం తెలిసిందే. ఆ తరువాత వారు కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు ఆరోపణలు వచ్చాయి. పార్టీ ఫిరాయింపుల చట్టానికి వ్యతిరేకంగా వీరు పని చేస్తున్నారని.. వీరి శాసనసభ సభ్యత్వంపై అనర్హత వేటు వేయాలంటూ బీఆర్ఎస్, బీజేపీ నుంచి పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ పిటిషన్లపై స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ బుధవారం తుది తీర్పును ప్రకటించారు. తాజా విచారణలో తాము ఇప్పటికీ బీఆర్ఎస్‌లోనే ఉన్నామని, పార్టీ మారలేదని దానం నాగేందర్, కడియం శ్రీహరి స్పష్టం చేశారు. దానం, కడియం వాంగ్మూలాలను పరిగణనలోకి తీసుకున్న స్పీకర్.. వీరిద్దరినీ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలుగానే గుర్తిస్తున్నట్లు ప్రకటించారు. అనర్హత వేటు పిటిషన్లను కొట్టేశారు. దీంతో ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరిలకు ఊరట లభించినట్లయ్యింది. ఇదిలాఉంటే.. గురువారం సుప్రీంకోర్టులో పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల అంశంపై విచారణ జరగనుంది. ఇప్పటికే పలుమార్లు విచారించిన అత్యున్నత న్యాయస్థానం.. కేసు మళ్లీ విచారణకు వచ్చేలోగా స్పీకర్ తన నిర్ణయం ప్రకటించాలని సూచించింది. ఈ మేరకు తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ బుధవారం తీర్పు వెలువరించారు. ఇప్పటికే 8మంది ఎమ్మెల్యేలకు స్పీకర్ క్లీన్ చిట్ ఇచ్చారు. ఇప్పుడు మరో ఇద్దరికి క్లీన్ చిట్ ఇవ్వండతో మొత్తం పదిమంది ఎమ్మెల్యేలు పార్టీ మారలేదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఈ పదిమంది కాంగ్రెస్‌లో చేరారు. అయితే టెక్నికల్‌గా ఇది రుజువు కాకపోవడంతో దీనిని స్పీకర్ తిరస్కరించారు. ఈ క్రమంలో నేటి సుప్రీం విచారణలో ఏం జరుగుతుందో అన్న ఉత్కంఠ నెలకొంది.

## లోక్‌సభలో స్పీకర్‌పై వీగిన అవిశ్వాసం

**న్యూఢిల్లీ,మార్చి 11 :** లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై విపక్షాలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం మూజువాణి ఓటుతో బుధవారంనాడు వీగిపోయింది. విపక్ష ఎంపీల మద్దతుతో కాంగ్రెస్ పార్టీ ఎంపీ మహమ్మద్ జావేద్ ఈ తీర్మానాన్ని తొలి దఫా పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లో ప్రవేశపెట్టగా, రెండో దఫా బడ్జెట్ సమావేశాల్లో దీనిపై చర్చను ప్యానల్ స్పీకర్ జగదంబిక పాల్ చేపట్టారు. రాహుల్ గాంధీ, అమిత్‌షా, రవిశంకర్ ప్రసాద్ తదితరులు చర్చలో పాల్గొన్నారు. అనంతరం ఓటింగ్ చేపట్టగా... మూజువాణి ఓటుతో ప్రతిపక్షాల తీర్మానం వీగిపోయింది. ఆ వెంటనే లోక్‌సభను ప్యానెల్ స్పీకర్ గురువారంనాటికి వాయిదా వేశారు. స్పీకర్ సభలో పక్షపాతంతో వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ విపక్ష సభ్యులు పెట్టిన అవిశ్వాస తీర్మానంపై మంగళవారం నుంచి బుధవారం వరకు సుదీర్ఘంగా చర్చ జరిగింది. ఈ చర్చలో విపక్షాలు చేసిన విమర్శలకు కేంద్ర మంత్రి అమిత్ షా సమాధానం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన కాంగ్రెస్‌పై మండిపడ్డారు. స్పీకర్ అంకితభావాన్ని విపక్షాలు ప్రశ్నిస్తున్నాయి. ప్రతిపక్షాలు నిబంధనలు ఉల్లంఘిస్తేనే స్పీకర్ రంగంలోకి దిగారు. పార్లమెంటు నిబంధనలు నెహ్రూ హయాంలోనే రూపొందించారు. కాంగ్రెస్ రూపొందించిన నిబంధనలపై చర్చకు సిద్ధం. పార్టీలకు అతీతంగా స్పీకర్ వ్యవహరిస్తారు. లోక్‌సభ నిబంధనల ప్రకారం స్పీకర్‌దే తుది నిర్ణయం. స్పీకర్ స్థానాన్ని రాజకీయ కోణంలో చూడటం తగదని అమిత్ షా స్పష్టం చేశారు. 'స్పీకర్ పదవికి రాజకీయాలతో సంబంధం లేదు. సభలో ఆయన అందరివాడు, అన్ని పార్టీల ఏకాభిప్రాయంతోనే స్పీకర్ ఎంపిక జరిగింది. అటువంటి వ్యక్తి నిబద్ధతను, నిష్పక్షపాత వైఖరిని ప్రశ్నించాల్సిన అవసరం లేదు' అని ఆయన వ్యాఖ్యానించారు. సభా నిబంధనలను కాంగ్రెస్ పార్టీ పదే పదే ఉల్లంఘిస్తోందని అమిత్ షా ఆరోపించారు. ఆయన గత చరిత్రను గుర్తు చేస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. 'ప్రస్తుతం సభలో అమలవుతోన్న నిబంధనలు నెహ్రూ కాలంలో రూపొందబడ్డాయి, వాటిని గౌరవించాల్సిన బాధ్యత అందరిపై ఉంది. సభా మర్యాదలను కాపాడటంతో ప్రతిపక్షాలు విఫలమవుతున్నాయి, నిబంధనలను పాటించకుండా స్పీకర్‌పై తప్పుడు ఆరోపణలు చేయడం సరికాదని అన్నారు.

## ప్రజాస్వామ్యంపై బహిరంగ దాడి

- కడియం, దానంలకు క్లీన్‌చిట్‌పై కెటిఆర్



**హైదరాబాద్,మార్చి 11 :** పార్టీ ఫిరాయింపుల వ్యవహారంలో ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరికి శాసనసభాపతి ప్రసాద్ కుమార్ క్లీన్ చిట్ ఇవ్వడం ప్రజాస్వామ్యంపై బహిరంగ దాడి అని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ మండిపడ్డారు. పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తూ స్పీకర్ తీసుకున్న ఈ నిర్ణయం ప్రజాస్వామ్య చరిత్రలో చీకటి రోజుగా అభివర్ణించారు. ఇది కేవలం ఒక తీర్పు కాదు.. అధికారంలో ఉన్నవారికి అనుకూలంగా రాజ్యాంగ వ్యవస్థలను ఉపయోగించే ఉదాహరణ అని పేర్కొన్నారు. ఇలాంటి నిర్ణయాలు ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీస్తాయన్నారు. తెలంగాణ ప్రజలు అన్నీ గమనిస్తున్నారని.. సరైన సమయంలో సమాధానం చెబుతారని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీ బీఫామ్ మీద ఎంపీగా పోటీ చేసిన వ్యక్తికే క్లీన్‌చిట్ ఇవ్వడం అంటే ప్రజల తీర్పును అవమానించడమేనని వ్యాఖ్యానించారు. పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తూ స్పీకర్ తీసుకున్న నిర్ణయం ప్రజాస్వామ్య చరిత్రలో చీకటి రోజు అని కేటీఆర్ అభివర్ణించారు. ఇది కేవలం తీర్పు కాదు.. అధికారంలో ఉన్న వారికి అనుకూలంగా రాజ్యాంగ వ్యవస్థను ఉపయోగించే ఉదాహరణ అన్నారు. ప్రజల ఓట్లతో గెలిచిన పదవులను లాభాల కోసం మార్చుకుంటే.. స్పీకర్ దానికి ఆమోద ముద్ర వేస్తే.. ప్రజాస్వామ్య విలువలు ఎక్కడ నిలుస్తాయని ప్రశ్నించారు. ఇలాంటి నిర్ణయాలు ప్రజల విశ్వాసానికి దెబ్బ అని అన్నారు.

RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైదరాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక

# ఎలక్ట్రిక్ గో-కార్ట్ డిజైన్‌లో గురు నానక్ విద్యార్థుల సత్తా




(హైదరాబాద్ ఎస్టేట్ (ప్రతినిధి) మార్చి 11:-రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం:- గురు నానక్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ( జి ఎన్ ఐ టి )కి చెందిన మెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థులు 13వ జాతీయ స్థాయి ఎలక్ట్రిక్ గో-కార్ట్ డిజైన్ ఛాలెంజ్ పోటీలలో ఎలక్ట్రిక్ వెహికల్ విభాగంలో 5వ స్థానాన్ని సాధించి తమ సాంకేతిక నైపుణ్యాన్ని మరోసారి రుజువు చేశారు. తమిళనాడులోని కోయంబత్తూరు లో ఉన్న కారి మోటార్ స్పీడవే లో, ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఇస్నీ మోటార్ స్పోర్ట్స్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించబడ్డాయి. దేశవ్యాప్తంగా సుమారు 80 ప్రముఖ ఇంజనీరింగ్ కళాశాలలు ఈ పోటీలో పాల్గొన్నాయి. విద్యార్థులు రూపొందించిన జుఎ గో-కార్ట్ అత్యా ధునిక సాంకేతికతతో రూపొందించబడిన ఈ వాహనంలోని ప్రత్యేకతలు, ఇందులో హై-పర్‌ఫార్మెన్స్ మోటార్ కంట్రోలర్ (6 నెఔ డిశ్చార్జ్ పవర్)లిథియం-అయాన్ బ్యాటరీ ప్యాక్ (జెకె - స్మార్ట్ బి ఎం ఎస్ మోడల్ 74అక్యుమ్యులేటర్ సిస్టమ్ 100 సెల్స్ సమాంతరంగా గా ఉన్నాయి. ఈ వాహనం ముఖ్య లక్షణాలు, గరిష్ట వేగం : సుమారు 100 కిమీ/గంట ఒక్కో ఛార్జ్‌తో ప్రయాణించే దూరం : 90 100 కిమీ రీఛార్జ్ సమయం : సుమారు 5 గంటలు మొత్తం బరువు : 128 కిలోలు. ఈ విజయంతో విద్యార్థుల అంకితభావం, సృజనాత్మకత ఆవిష్క రణాత్మక ఆలోచనలకు గురు నానక్ విద్యాసంస్థలు అందిస్తున్న ప్రోత్సాహం ఎంతో ప్రశం సనీయమని నిర్వాహకులు అభిప్రా యప డ్డారు. ఈ సందర్భంగా గురు నానక్ విద్యాసంస్థల వైస్ చైర్మన్ గురు నానక్ యూనివర్సిటీ ఛాన్సలర్ అయిన సర్దార్ గగన్ దీప్ సింగ్ కోహ్లీ, విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ గురు నానక్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ అయినా డా. హెచ్.ఎస్. సైని, విద్యార్థుల సృజనా త్మకతను నూతన ఆవిష్కరణలను అభినం దిస్తూ భవిష్యత్తులో ఇలాంటి ఆవిష్కరణలకు తమ తరపున పూర్తి ప్రోత్సాహం ఉంటుందని ఆ దిశగా అధ్యాపకులు కూడా విద్యార్థులను ప్రేరేపించాలని వివరిస్తూ విజేతలకు తమ శుభాకాంక్షలు తెలియచేసారు. డా. బి. వెంకట రమణ రెడ్డి (ప్రిన్సిపాల్), డా. ఎస్.పి. యాదవ్ (డీన్ -- అకడమిక్స్), డా. బి. సంతోష్ కుమార్ (డీన్ -- =డణ), డా. బి. విజయ కుమార్ డా. పి. వెంకయ్య (ఫ్యాకల్టీ అడ్వైజర్) విద్యార్థులను అభినందించారు. ఈ విజయంతో మెకానికల్ ఇంజనీరింగ్ ఆటోమోటివ్ డిజైన్ రంగాల్లో ప్రతిష్ట మరింత పెరిగిందని, విద్యార్థుల్లో సాంకేతిక నైపుణ్యం,
ఆవిష్కరణాత్మక ఆలోచన మరియు ఇంజనీరింగ్ ప్ర తిభను అభివృద్ధి చేయడంలో సంస్థ నిరంతరం
కృషి చేస్తుందని వారు తెలిపారు.

# ప్రతి మహిళ ఆర్థికంగా బలపడాలి

- సమాజంలో గౌరవంగా బ్రతకాలి

అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా ముఖ్య

- అతిథిగా మల్ రెడ్డి రామ్ రెడ్డి






(హైదరాబాద్ ఎస్టేట్ (ప్రతినిధి) మార్చ్11:-అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కందికంటి శ్రీధర్ గౌడ్ ఆధ్వర్యంలో సరూర్‌నగర్‌లోని గౌడ సంఘం భవనంలో నిర్వహించిన కార్యక్రమానికి రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సేవా రంగంలో అంకితభావంతో పనిచేస్తున్న మహిళల కృషిని గుర్తిస్తూ మహిళా పోలీసులను, జీహెచ్ఎంసీ మహిళా కార్మికులను శాలువా కప్పి సన్మానించారు. సమాజ శ్రేయస్సు కోసం వారు నిర్విరామంగా చేస్తున్న సేవలు ప్రశంసనీయమని అభినందిస్తూ, వారి సేవాభావం ఇతరులకు ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలందరికీ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. మహిళా సాధికారత కోసం ప్రతి ఒక్కరూ అహర్నిశలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. మహిళల ఆర్థిక సాధికారత కుటుంబానికి వెలుగుదీపిక వంటిదని, సమాజంలో స్త్రీలు గౌరవంగా జీవించాలంటే విద్యా, ఉపాధి రంగాల్లో వారు ముందుకు రావాలని పేర్కొన్నారు. స్త్రీ శక్తి సమాజానికి బలం అని, స్త్రీ సాధికారతే అభివృద్ధికి మార్గమని ఆయన అన్నారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం మహిళా సాధికారతను లక్ష్యంగా తీసుకుని ఆడబిడ్డల అభివృద్ధి కోసం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందని గుర్తుచేశారు. అధికారం చేపట్టిన ఆరు నెలల వ్యవధిలోనే మహిళల ఆర్థిక స్వావలంబనను పెంపొందించేందుకు హైటెక్ సిటీలో ఇందిరా మహిళా శక్తి బజారు ఏర్పాటు చేసి 140కి పైగా స్టాల్స్‌ను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. మహిళా స్వయం సహాయక సంఘాలు తయారు చేసిన గ్రామీణ కుటీర పరిశ్రమల ఉత్పత్తులను మధ్యవర్తులు లేకుండా నేరుగా వినియోగదారులకు విక్రయించే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందన్నారు. అలాగే గడిచిన రెండున్నరేళ్లలో డ్వాక్రా మహిళా సంఘాలకు సుమారు 23 వేల కోట్ల రూపాయల వడ్డీ లేని రుణాలు మంజూరు చేసినట్లు వెల్లడించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించినట్లు తెలిపారు. కోటి మహిళలను కోటీశ్వర్లుగా చేసే లక్ష్యంతో మహిళా సంఘాలను పెద్ద వ్యాపారాల్లోకి తీసుకురావడానికి పెట్రోలు బంకులు, బస్సులు, డైరీ యూనిట్లు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, ప్రత్యేక మహిళా బజార్లు వంటి పలు కార్యక్రమాల ద్వారా వారికి ఆదాయం పెరిగే విధంగా ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నదని పేర్కొన్నారు. కుటుంబానికి ఆధారం, సమాజానికి స్ఫూర్తిగా నిలుస్తున్న మహిళల శక్తి, సహనం, ప్రేమ, త్యాగం అపూర్వమని కొనియాడారు. విద్యా రంగంలో మహిళలు విశేష ప్రతిభ కనబరుస్తూ ఉన్నత శిఖరాలను అధిరోహిస్తున్నారు. ఎంతో మంది మహిళలు ఐఏఎస్, ఐపీఎస్ వంటి అత్యున్నత సర్వీసుల్లో చేరి దేశానికి సేవలందిస్తూ ఇతరులకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు అని పేర్కొన్నారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగాలని ఆకాంక్షిస్తూ ప్రతి మహిళ ధైర్యంగా, ఆత్మవిశ్వాసంతో తన జీవితాన్ని నిర్మించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ముద్దగోని లక్ష్మీ ప్రసన్న గౌడ్, కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షులు బద్దుల వేణుగోపాల్ యాదవ్, దాచర్లపల్లి శ్రీపాల్ రెడ్డి; సీనియర్ కాంగ్రెస్ నాయకులు తులసి శ్రీనివాస్, బబ్బూరి ఆనంద్ గౌడ్, బేర బాలకిషన్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పన్యాల జైపాల్ రెడ్డి, మెగావత్ గణేష్ నాయక్; నాయకులు కోటగిరి శ్రీనివాస్ గౌడ్, మహిళా నాయకురాలు వసంత, మహిళా పోలీసులు, జీహెచ్ఎంసీ మహిళా కార్మికులు, డాక్టర్ సుష్మిత తదితరులు పాల్గొన్నారు.

# వెలుగుమట్ల భూదాన్ భూముల నిరుపేదలకు న్యాయం చేయాలి

- అదనపు కలెక్టర్‌కు తెలంగాణ జాగృతి వినతి



(హైదరాబాద్ ఎస్టేట్ (ప్రతినిధి) మార్చ్11:-వెలుగుమట్ల భూదాన్ భూముల ప్రజలకు జరిగిన అన్యాయం శాంతియుత నిరసనకారుల పట్ల ప్రభుత్వ అధికారులు వ్యవహరించిన తీరుపై బుధవారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలో రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ కె.శ్రీనివాస్ ని తెలంగాణ జాగృతి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కప్పాటి పాండురంగారెడ్డి, జిల్లా బిసి సెల్ అధ్యక్షుడు కె,శివశంకర్లుకలిసి వినతి పత్రాన్ని ఇచ్చారు. ఈ సంద ర్భంగా కప్పాటి పాండురంగారెడ్డి కె.శివశంకర్ మాట్లాడుతూ..ఖమ్మం జిల్లా వెలుగుమట్ల భుదాన్ భూములలో దశాబ్దాలుగా నివాసం ఉంటున్న నిరుపేద కుటుంబాల ఇల్లను ఎలాంటి ప్రత్యామ్నాయ పునరావాసం చూపకుండా, వారి భద్రతను, ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తూ అధికారులు వ్యవహరించిన తీరు అత్యంత అమానవీయమైనది. నిరుపేదల జీవనోపాధిని దెబ్బతీసే ఈ చర్యలకు నిరసనగా, బాధిత కుటుంబాలకు అండగా తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు శ్రీమతి కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో ఖమ్మం పట్టణంలోని అంబేద్కర్ భవన్ వద్ద శాంతియుత నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగింది. ప్రభుత్వం అమానుషంగా అక్రమంగా అరెస్ట్ చేసి కవితక్కను హైదరాబాద్ తీసుకురావడంతో నిరవధిక నిరాహార దీక్షకు పూనుకోని గత రెండురోజులు గా చేస్తన్న తరుణం లో ప్రభుత్వం తాత్కాలిక ఉపశమనంలా కేవలం మూడు వందల పదకొండుమందికి 75 గజాల ఇంటిస్థలంతో ఇల్లు నిర్మాణం చేస్తామంటూ టోకన్ ఇచ్చి మిగతా కొద్దిమందికి మాత్రమే సొంత ఊరులో ఇస్తామంటూ,కొంతమందిని అనర్హులుగా చెప్పడం అప్రజాసామ్యం అని అన్నారు. భూ దాన్ ఉద్యమం ద్వారా నిరుపేదలకు పంపిణీ చేసిన భూముల్లోంచి వారిని గెంటివే యడం, అణగారిన వర్గాల హక్కులను కాపాడాల్సిన ప్రభుత్వమే ఇలా వారి ఇళ్లను నేల మట్టం చేయడం సామాజిక న్యాయానికి గొడ్డలిపెట్టు **లాంటిదని** వారు అన్నారు.

**మా ప్రధాన డిమాండ్లు:**

- తక్షణ పునరావాసం: ఇళ్లు కోల్పోయి నిరాశ్రయులైన నిరుపేద కుటుంబాలకు తక్షణమే న్యాయమైన, మానవీయమైన పునరావాసం కల్పించాలి. హక్కుల రక్షణ: బాధిత కుటుంబాల జీవనోపాధికి, వారి హక్కులకు తక్షణ భద్రత కల్పించాలి.
- శాంతియుత చర్చలు: ఈ సమస్యను పరిష్కరించేందుకు అధికారుల ఏకపక్ష నిర్ణయాలు కాకుండా, బాధితులు మరియు వారి ప్రతినిధులతో తక్షణమే నిర్మాణాత్మక చర్చలు ప్రారంభించాలి. వేధింపులు ఆపాలి: న్యాయం కోసం శాంతియుతంగా నిరసన తెలుపుతున్న వారిపై ఎలాంటి పోలీసు కేసులు, బెదిరింపులు, లేదా వేధింపులకు పాల్పడకూడదు.
- వెలుగుమట్ల నిరుపేదల ఆక్రందనలను జిల్లా యంత్రాంగం, ప్రభుత్వం తక్షణమే పరిగణనలోకి తీసుకొని వారికి సత్వరమే న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నామని వారు అన్నారు వారితో పాటు రయకంటి జగన్,
అన్నబోయిన శ్రీశైలం,విజయ భార్గవ రెడ్డి, సిహ్ వీరేష్ ప్రకాశ్ జాగృతి నాయకులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ కార్మికుల సేవలను తక్కువగా చూడొద్దు
## సీఎం వ్యాఖ్యలపై ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి స్పందన






(హైదరాబాద్ ఎస్టేట్ (ప్రతినిధి) మార్చ్11:-పారిశుద్ధ కార్మికులపై అవగాహన లేకుండా మాట్లాడుతున్న ముఖ్యమంత్రి ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి మహేశ్వరం నియోజకవర్గంలోని జిహెచ్ఎంసిమీర్పేట్ ప్రాంతంలో పారిశుద్ధ కార్మికులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్న మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మున్సిపల్ శాఖపై పూర్తి అవగాహన లేకుండా పారిశుద్ధ కార్మికులపై ఇష్టానుసారంగా వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వంలో పారిశుద్ధ కార్మికులకు సుమారుగా 4 వేల చెత్త ఆటోలు అందించడంతో పాటు సంవత్సరానికి రెండుసార్లు వేతనాలు పెంచి, వారి ఆరోగ్యం కోసం అనేక సదుపాయాలు కల్పించామని గుర్తుచేశారు. కరోనా కష్టకాలంలో మనమంతా ఇళ్లలో ఉండగా ప్రజల ఆరోగ్యం, శుభ్రత కోసం రోడ్లపై పనిచేసింది పారిశుద్ధ కార్మికులేనని, వారి సేవలను మరచిపోవద్దని ముఖ్యమంత్రికి హితవు పలికారు. అంతేకాకుండా ఈ పారిశుద్ధ కార్మికులకు గడిచిన రెండు సంవత్సరాలుగా పీఎఫ్ డబ్బులు రావట్లేదని, ఇన్సూరెన్స్ లేదని మరియు వారికి తీసుకోవలసిన జాగ్రత్తల ప్రకారంగా అవేవీ సరిగ్గా అందించట్లేదని పారిశుద్ధ కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బడంగ్‌పేట్ జిహెచ్ఎంసి డీసీ సరస్వతి, ఇతర అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## చెన్నూరు మార్కెట్ కమిటీ చైర్మన్‌గా మహేశ్ ప్రసాద్ తివారీ ప్రమాణ స్వీకారం




(హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి మార్చ్ 11:-మంచిర్యాల జిల్లా, చెన్నూరు:చెన్నూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా మహేశ్ ప్రసాద్ తివారీ ఘనంగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి కార్మిక, మైనింగ్ శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్‌తో కలిసి హాజరయ్యారు. మార్కెట్ కమిటీ కార్యాలయం ప్రాంగణంలో నిర్వహించిన ప్రమాణ స్వీకార కార్యక్రమంలో మహేశ్ ప్రసాద్ తివారీతో పాటు కమిటీ సభ్యులు కూడా పదవీ ప్రమాణం చేశారు. కార్యక్రమంలో మంత్రి వివేక్ వెంకటస్వామి కొత్తగా బాధ్యతలు చేపట్టిన చైర్మన్, సభ్యులకు అభినందనలు తెలిపారు. రైతులకు మరింత మెరుగైన సేవలు అందించేలా మార్కెట్ కమిటీ పని చేయాలని సూచించారు.

ప్రమాణ స్వీకార మహోత్సవానికి స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు మరియు పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు. కొత్త చైర్మన్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తూ కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది.

RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైద్రాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక

## ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా చెట్ల సంరక్షణ మున్సిపాలిటీలో పబ్లిక్ టాయిలెట్ మరమ్మతులు




(హైదరాబాద్ ఎస్టేట్ (ప్రతినిధి) మార్చి11:-ఇబ్రహీంపట్నం: ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పరిధిలో పలు అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. బొంతపల్లి కుంట సమీపంలో "ఉమెన్ ఫర్ ట్రీస్" కార్యక్రమాన్ని నిర్వహించి, ఎస్ ఎస్ జి మహిళలతో కలిసి చెట్లకు నీళ్లు పోసి వాటి సంరక్షణపై అవగాహన కల్పించారు.పర్యావరణ పరిరక్షణలో మహిళల పాత్ర ఎంతో ముఖ్యమని పేర్కొంటూ, చెట్ల పెంపకం సంరక్షణ ద్వారా పచ్చదనాన్ని పెంపొందించాలని అధికారుల సూచించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు చెట్లకు నీళ్లు పోసి వాటి సంరక్షణకు తమ వంతు సహకారం అందించారు.అదేవిధంగా, ప్రజలకు అందుబాటులో ఉన్న పబ్లిక్ టాయిలెట్‌ను కూడా పరిశీలించి, అక్కడ ఉన్న సమస్యలను గుర్తించి వెంటనే మరమ్మతులు చేపట్టేలా చర్యలు తీసుకున్నారు. ప్రజలకు పరిశుభ్రమైన సౌకర్యవంతమైన సదుపాయాలు
అందించడమే లక్ష్యంగా ఈ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రజా సౌకర్యాల మెరుగుదలకు ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు ఇబ్రహీంపట్నం మున్సిపల్ కమిషనర్ వై. సుదర్శన్ తెలిపారు.

## అనారోగ్యంతో మృతి చెందిన రామస్వామి కుటుంబానికి ఆర్థిక సహాయం

**- కడ్తాల్ మాజీ జెడ్పిటిసి రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ జర్పుల దశరథ్ నాయక్**



(హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి మార్చి11:-కడ్తాల్ మండల కేంద్రంలో మక్తమాదారం గ్రామపంచాయతీ కీ చెందిన అర్కోటం రామస్వామి అనారోగ్యంతో బాధపడుతూ నిన్న హైదరాబాద్ హాస్పిటల్ లో మరణించడం జరిగింది. స్థానిక టిఆర్ఎస్ నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న కడ్తాల్ మాజీ జడ్పిటిసి లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ జర్పుల దశరథ్ నాయక్ మృతుడు రామస్వామి కుటుంబానికి పరామర్శించి పార్థవ దేహానికి పూలమాల వేసి కుటుంబ సభ్యులను ధైర్యం చెప్పి ఏలాంటి సాయ సహకారాలు కావాలన్నా తన రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఎల్లప్పుడు అండగా ఉంటుందని తన రాధాకృష్ణ మెమోరియల్ చారి ట్రబుల్ ట్రస్ట్ ద్వారా 5000 వేల రూపాయలు అందజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో సర్పంచ్ నరసింహ గౌడ్ ఉప సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్ మాజీ సర్పంచ్ సులోచన సాయిలు మాజీ ఎంపిటిసి మంజుల చంద్రమౌళి గ్రామ కమిటీ అధ్యక్షుడు సత్యనారాయణ నాయకులు కృష్ణయ్య ప్రభాకర్ జంగయ్య చందు శ్రీకాంత్ బాలకృష్ణ నరేందర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## తల్లి బిడ్డల ఆరోగ్యానికి ప్రత్యేక చర్య ఇబ్రహీంపట్నం బస్ స్టాప్‌లో మదర్ ఫీడింగ్ సెంటర్ ప్రారంభం






(హైదరాబాద్ ఎస్టేట్ (ప్రతినిధి) మార్చి11:-ఇబ్రహీంపట్నం: తల్లి, శిశువుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఇబ్రహీంపట్నం బస్ స్టాప్‌లో ఏర్పాటు చేసిన "మదర్ ఫీడింగ్ సెంటర్" ను స్థానిక ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ప్రారంభించారు. మహిళా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కేంద్రాన్ని ప్రజలకు అంకితం చేస్తూ ఎమ్మెల్యే కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ తల్లి--బిడ్డల ఆరోగ్యం సమాజ అభివృద్ధికి ఎంతో కీలకమని అన్నారు. ప్రజలకు అవసరమైన ప్రతి సౌకర్యాన్ని అందించేందుకు తాము ఎల్లప్పుడూ కృషి చేస్తున్నామని తెలిపారు. ముఖ్యంగా ప్రయాణ సమయంలో తల్లులు తమ చిన్నపిల్లలకు సౌకర్యవంతంగా పాలిచ్చేందుకు ఈ కేంద్రం ఎంతో ఉపయోగకరంగా ఉండనుందని పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన సదుపాయాలను అందించడం తమ ముఖ్య లక్ష్యమని, తల్లులు చిన్నపిల్లల కోసం ఏర్పాటు చేసిన ఈ మదర్ ఫీడింగ్ సెంటర్ ఎంతో అవసరమైనదని ఎమ్మెల్యే రంగారెడ్డి తెలిపారు. ఈ కేంద్రం ద్వారా తల్లులు సురక్షితంగా, సౌకర్యవంతంగా పిల్లలకు పాలిచ్చే అవకాశం లభిస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో మహిళా సంక్షేమ శాఖ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు స్థానికులు పాల్గొన్నారు.

# మంత్రులు హెలికాప్టర్లలో ఆర్భాటంగా తిరగడమే తప్ప అభివృద్ధి శూన్యం

**- మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి**

**- మాజీ ఎమ్మెల్యే రవీంద్ర కుమార్**






హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ ప్రతినిధి మల్లేపల్లి :

- చందంపేట మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మాజీ ఎంపీపీ ముత్యాల సర్వయ్య మాజీ మంత్రి జగదీష్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు,మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్ సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు
- జగదీష్ రెడ్డి, రవీంద్ర కుమార్ మాట్లాడుతూ
బట్టి విక్రమార్కకొడుకు పెళ్ళిలో కేటీఆర్ ను కాబోయే సీఎం అని కాంగ్రెస్ నాయకులే అంటున్నారు
మంత్రులు హెలికాప్టర్లు తిరగడం తప్ప అభివృధి లేదు
కాంగ్రెస్ వచ్చాక వాళ్ల చుట్టలు అభివృధి ఐతున్నారు.ప్రజల అభివృద్ధి లేదుమంత్రులు ఎక్కడికి పోయినా హెలికాప్టర్లు కావాలి.మేము అధికారంలో ఉన్నపుడు కారు తప్ప వేరే వాడలేదుఉమ్మడి నల్గొండ జిల్లా మంత్రులకు దేవరకొండ రావాలన్న నల్గొండ పోవాలన్న హెలికాప్టర్ కావాలి
రైతు బంధు 10000 ఇస్తున్న కేసీఆర్ కాదని ఆశపడి కాంగ్రెస్ కి ఓటు వేశారురైతు బంధు కేసీఆర్ ఉన్నప్పుడు ఎన్ని వచాయి ఇప్పుడు అన్నీ వచ్చాయో చూసుకోవాలిముసి చుట్టూ 25 ఎకరాల భూములు తీసుకుని వారికి కావలసివన ఇస్తున్నారు
రాహుల్ గాంధీకి మూటలు అప్పజెప్పు తున్నారు మహిళలకు2500,లక్ష రూపాలు తులం బంగారం. నిరుద్యోగ యువతను ఉద్యోగస్తులను మోసం చేశారునల్గొండ జిల్లా అంతట పాత కాంగ్రెస్ నాయకులు సైతం నాతో మాట్లాడుతున్నారు కాంగ్రెస్ పార్టీ నాయకులు వాళ్ళ కార్యకర్తలనే తలదించుకునేటట్లు చేశారు రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీ
అన్ని సంక్షేమ పథకాలు రావాలంటే కేసీఆర్ మళ్ళీ సీఎం కావాలిఅభివృధి చేయకుంటే ప్రజలు రోడ్ల మీదికి రావాలిలిఅని ప్రజలకు పిలుపునిచ్చారు

# సిఐటియు కార్యాలయంలో శ్రీ వెంకటరమణ కాలనీలో సావిత్రిబాయి పూలే వర్ధంతి



(హైదరాబాద్ ఎస్టేట్ (ప్రతినిధి) మార్చ్11:-భవన నిర్మాణ కార్మిక సంఘం రంగారెడ్డి జిల్లా సహాయ కార్యదర్శి, పొట్టేపాకు రామస్వామి అధ్యక్షతన అట్టడుగువర్గాల అక్షరం సావిత్రి భాయి ఆశయవిరోధి అరెస్సెస్ బీజేపీ జ×ఖ వనస్థలిపురం కమిటీ ఆధ్వర్యంలో సావిత్రి భాయి పూలేవర్ధంతి మహిళా కార్మికులతో కలిసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి సిఐటియు రంగారెడ్డి జిల్లా సహాయ కార్యదర్శి ఆలేటి ఎల్లయ్య హాజరై మాట్లాడుతూ..అట్టడుగు వర్గాల అక్షరం సావిత్రి భాయి ఆశయాలకు విరోధిగా ఆర్ఎస్ఎస్ బిజెపి ఉన్నత విద్యను పేద ప్రజలకు దూరం చేస్తుందని కాసులు లేని కామన్ విద్యను ప్రతి ఒక్కరికి అందించాలని తద్వారా సావిత్రి భాయి పూలేఆశయ సాధన కోసం కృషి చేయాలని, అన్నారు.
భారతీయ సమాజంలో వేల సంవత్సరాల మనస్మృతి భావాలు ప్రజల మెదళ్లను కలుషితం చేయడమే కాకుండా అసమానతలు సృష్టించాయని అట్టడుగు వర్గాలకు అక్షరాన్ని నిషేధించాయని ఆ కాలంలో అట్టడుగు వర్గాల మొట్టమొదటి అక్షరం సావిత్రిబాయి పూలే అని కొనియాడారు సత్యశోధకు సమాజ్ నిర్మించిన జ్యోతిబాపూలే అడుగుజాడల్లో సావిత్రిబాయి పూలే ఫాతిమా షేక్ తో కలిసి సమర్థవంతంగా అనేక పాఠశాలలు నడిపించిందన్నారు శూద్రులు అస్పృశ్యులకు మొట్టమొదటి చదువుల తల్లిగా నిలిచిందన్నారు కుల వివక్షత లేని సమాజాన్ని నిర్మించాలని జీవితాంతం పరితపించి ముక్కోని ధైర్యంతో పోరాటం చేసిన మార్గదర్శి మహాత్మ సావిత్రిబాయి పూలే అన్నారు. ఆడపిల్లలు చదువుకుంటేనే సమాజం సంపూర్ణంగా బాగుపడుతుందని భావించి, వారికి విద్యనందించడంలో ఎనలేని కృషి చేసిన ధైర్యశాలి ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతూఎన్నో అవరోధాలను ఎదుర్కొంటూ సమానత్వం కోసం పాటుపడిన సావిత్రిబాయి పూలే నేటి తరానికి జీవితం స్ఫూర్తి దాయకం అన్నారు బాలి కలతో పాటు దళితులకు విద్యనందించడంలో, వితంతువుల జీవితాల్లో వెలుగులు నింపడంలో, రోగులకు సేవ చేయడంలో సావిత్రిబాయి పూలే గారు దిక్సూచిగా నిలిచారని చెప్పారు మహారాష్ట్రలో ప్లేగు వ్యాధి సంభవించినప్పుడు పేదలను కాపాడటానికి అనేక వైద్య వైద్య సేవలు అందించడమే కాకుండా వితంతువుల పునర్వివాహాలు దండల పెళ్లిల ద్వారా అభ్యుదయ వివాహాల్ని ప్రోత్సహించిన పూలే దంపతులు ఎప్పటికీ భారతీయ సమాజం మరువదన్నారు సావిత్రి బై ఆశయాలకు విరోధిగా నేటి కేంద్ర ప్రభుత్వం నూతన జాతీయ విద్యా విధానం పేరుతో రిజర్వేషన్లు రద్దుచేసి కార్పొరేట్లను ప్రోత్సహించడమే కాకుండా అట్టడుగు వర్గాలకు విద్యను దూరం చేస్తుందని విమర్శించారు కాసులు లేని కామన్ విద్యా ప్రతి ఒక్కరికి దక్కడం కోసం ఉద్యమించడం ద్వారా సావిత్రిబాయి పూలే ఆశయాలను నెరవేర్చబడతాయని చెప్పారు సావిత్రిబాయి పూలే పై మరింత సాహిత్యం రావాల్సిన అవసరం ఉందని ప్రతి కుటుంబంలో సావిత్రిబాయి జీవితాన్ని అధ్యయనం చేసే విధంగా సమాజం ముందుకు సాగాలని చెప్పారు ఈ కార్యక్రమంలో పోలే రమేష్ పోలే వెంకటేష్ మహేష్,లలిత,అనిత, కలమ్మ లక్ష్మమ్మ, ఆలేటి సుజాత, సైదమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేటు యూనివర్సిటీ లను వ్యతిరేకించండి, ఎస్ఎఫ్ఐ

**- ప్రభుత్వ యూనివర్సిటీలను కాపాడండి ఈనెల 17,18 తేదీల్లో పాలమూరు యూనివర్సిటీలో**
**- జరిగే ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర యూనివర్సిటీల కన్వెన్షన్ జయప్రదం చేయండి**
**- కాకతీయ యూనివర్సిటీ పరిపాలన భవనం ముందు బహిరంగ సభ వాల్ పోస్టర్ విడుదల**




హైద్రాబాద్ ఎస్టేట్ న్యూస్/హన్మకొండ ప్రతినిధి :ఈ దేశంలో కొత్తగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తీసుక వస్తున్నటువంటి ప్రైవేట్ కార్పొరేటు యూనివర్సిటీలను వ్యతిరేకించాలని ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు స్టాలిన్ , మంద శ్రీకాంత్ అన్నారు బుధవారం రోజున కాకతీయ యూనివర్సిటీలోని పరిపాలన భవనం ముందు ఈ నెల 17, 18 తేదీలలో మహబూబ్ నగర్ జిల్లా లోని పాలమూరు యూనివర్సిటీలో నిర్వహించే ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర యూనివర్సిటీల కన్వెన్షన్ జయప్రదం చేయాలని వారు కోరారు ఈ సందర్భంగా బహిరంగ సభ వాల్ పోస్టర్స్ ను విడుదల చేశారు అనంతరం వారు మాట్లాడుతూ ఈ దేశంలో ప్రైవేటు కార్పొరేట్ యూనివర్సిటీలు విచ్చలవిడిగా పుట్టుకొస్తు న్నాయన్నారు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రైవేటు యూనివర్సిటీలకు కోమ్ము కాస్తూ ఈ భారతదేశం లో ఉన్నటువంటి ప్రభుత్వ యూనివర్సిటీలను నిర్వీర్యం చేసే కుట్ర ఈ దేశంలో జరుగుతుందన్నారు ప్రభుత్వ యూనివర్సిటీలను కాపాడాలని దేశవ్యాప్తంగా విద్యార్థుల మేధావులు కోరుకుంటూన్నారు ఈ ప్రభుత్వాలు దేశవ్యాప్తంగా ప్రైవేటు యూనివర్సిటీలకు విచ్చలవిటిగా అనుమతులు ఇస్తూ వారికి కొమ్ముకాస్తూ ప్రభుత్వ యూనివర్సిటీలను మూసివేసే కుట్ర జరుగుతుందన్నారు ప్రభుత్వ యూనివర్సిటీల్లో అనేకమైన సమస్యలతో విద్యార్థులు ఇబ్బందులు పడుతుంటే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఏరోజు కూడా యూనివర్సిటీలను పట్టించుకున్న పాపన్న పోలేదన్నారు ఈ దేశంలో ఉన్నటువంటి ప్రభుత్వ యూనివర్సిటీలకు అతి తక్కువ నిధులు కేటాయిస్తూ సమస్యల వలయంలోకి పాలకులు నెట్టి వేస్తున్నారు అన్నారు ఈ దేశంలో విద్యార్థులు మేధావులు ప్రైవేటు యూనివర్సిటీలను వ్యతిరేకించాలన్నారు ప్రభుత్వ యూనివర్సిటీలను కాపాడాలన్నారు ఈ పాలకుల కండ్లు తెరిచే విధంగా భవిష్యత్తులో ఈ దేశంలో విద్యార్థులు విద్యార్థి ఉద్యమాలకు అండగా నిలిచి పోరాటాలు చేయాలన్నారు ఈనెల 17 ,18 తేదీల్లో జరిగే తెలంగాణ యూనివర్సిటీల కన్వెన్షన్ కు విద్యార్థులు మేధావులు అధిక సంఖ్యలో పాల్గొని తెలంగాణ యూనివర్సిటీల కన్వెన్షన్ విజయవంతం చేయాలని ఈ సందర్భంగా వారు పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ కాకతీయ యూనివర్సిటీ అధ్యక్ష కార్యదర్శులు చెన్నూరి సాయి కుమార్ బిరెడ్డి జశ్వంత్ సహాయ కార్యదర్శి మల్లేష్ ఉపాధ్యక్షులు ,నాగరాజ్ రణదీప్ ,రాహుల్ పవన్ కుమార్ ,పవన్ ,అరుణ్ తదితరులు పాల్గొన్నారు

RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైదరాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక

# వెలుగుమట్ల భూదాన్ భూమి బాధితులకు తక్షణ న్యాయం చేయాలి

**- జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ సత్యం**



**ఖమ్మం, మార్చి 11:** ఖమ్మం జిల్లా వెలుగుమట్లలో భూదాన్ భూముల సమస్యతో ఇళ్లు కోల్పోయిన బాధిత కుటుంబాలకు తక్షణ న్యాయం చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ సత్యం డిమాండ్ చేశారు. భూదాన్ భూమి బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ మూడో రోజు కొనసాగుతున్న నిరవధిక నిరాహార దీక్షలో పాల్గొంటున్న కల్వకుంట్ల కవిత గారికి సంఘీభావం తెలుపుతూ ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా సత్యం మాట్లాడుతూ, ఖమ్మం పట్టణానికి సమీపంలోని వెలుగుమట్ల ప్రాంతంలో ఉన్న భూదాన్ భూముల్లో సుమారు 600 కుటుంబాలు సంవత్సరాలుగా నివసిస్తూ తమ కష్టార్జిత ధనంతో ఇళ్లు నిర్మించుకుని జీవనం సాగిస్తున్నాయని తెలిపారు. భూములపై స్పష్టమైన పరిష్కారం ఇవ్వాల్సిన ప్రభుత్వ అధికారులు సమస్యను దీర్ఘకాలంగా నిర్లక్ష్యం చేయడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. భూదాన్ ఉద్యమం ద్వారా పేదలకు ఇవ్వాల్సిన భూములు పేదల జీవనాధారంగా మారాల్సింది పోయి, రికార్డుల గందరగోళం మరియు అధికారుల నిర్లక్ష్యంతో వివాదాల కేంద్రంగా మారడం విచారకరమని పేర్కొన్నారు. భూముల విలువలు పెరిగిన తరువాత మాత్రమే ప్రభుత్వం అక్రమ ఆక్రమణల పేరుతో చర్యలు తీసుకోవడం ప్రజలలో అనుమానాలు రేకెత్తిస్తున్నదని ఆయన అన్నారు. ఇటీవల నిర్వహించిన భారీ ఎత్తున కూల్చివేత చర్యల వల్ల సుమారు 600 కుటుంబాలు, దాదాపు 3000 మంది ప్రజలు ఒక్కసారిగా గూడు కోల్పోయి రోడ్డునపడ్డారని సత్యం ఆవేదన వ్యక్తం చేశారు. పేదల జీవితకాల పొదుపులతో నిర్మించిన ఇళ్లు ఒక్కరోజులో కూల్చివేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. ముందస్తు పునరావాసం కల్పించకుండా ఇలాంటి చర్య లు తీసుకోవడం ప్రభుత్వ పరిపాలనా వైఫల్యాన్ని సూచిస్తుందని విమర్శించారు. ప్రభుత్వం తర్వాత సర్వేలు చేస్తామని, ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని ప్రకటించడం సరిపోదని, ముందుగా బాధిత కుటుంబాలకు తక్షణ పునరావాసం కల్పించి, భూదాన్ భూములపై స్పష్టమైన విధానం ప్రకటించాలని సత్యం డిమాండ్ చేశారు. మధ్యవర్తుల మోసాలకు గురైన పేదలపై చర్యలు కాకుండా, అలాంటి అక్రమాల వెనుక ఉన్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

వెలుగుమట్ల ఘటన తెలంగాణలో భూసంబంధిత పరిపాలనలో ఉన్న లోపాలను బయటపెట్టిందని ఆయన పేర్కొన్నారు. పేదలకు న్యాయం జరిగేలా ప్రభుత్వం వెంటనే చర్చలు జరిపి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని ఆయన కోరారు.

భూమి కోసం పోరాడుతున్న వెలుగుమట్ల బాధిత కుటుంబాలకు జాతీయ బీసీ సంక్షేమ సంఘం సంపూర్ణ మద్దతు ఉంటుందని గుజ్జ సత్యం స్పష్టం చేశారు. ప్రభుత్వం

బాధితుల సమస్యలను సానుభూతితో పరిగణించి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# యుద్ధం ఎక్కడో జరిగినా భారత్ ఎందుకు ఇబ్బంది పడుతుంది



ప్రపంచ వ్యాప్తంగా ప్రస్తుతం యుద్ధాల ట్రెండ్ నడుస్తుంది. దీనికి ప్రధానగా ఆధిపత్య ధోరణి కారణంగా కనిపిస్తుంది. ఒక దేశాన్ని మరో దేశం కంట్రోల్ చేయాలనే దురాశ పెరిగి, అడ్డగోలుగా అణు ఆయుధాలు నిల్వ చేసుకుని, చీటికీ మాటికీ గిల్లికజ్జాలు పెట్టు కొని, చిల్లర గొడవలు సృష్టించుకొని, బాంబులతో బేంబేలెత్తిస్తూ ప్రపంచ వినాశనానికి కొన్ని దేశాధినేతలు కారణమవుతుంటే, వారి అధికార దాహనికి, ఆధిపత్య కాంక్షకు ప్రపంచ కామన్ మ్యాన్ ఖరీదు కట్టాల్సి వస్తుంది. ఇలాంటి నీతిలేని యుద్ధ తంత్రాన్ని కట్టడి చేయాల్సిన ఐక్యరాజ్య సమితి కూడా అగ్రరాజ్యాల కనుసన్నల్లో పని చేయడం, ప్రపంచ మానవులు చేసుకున్న దౌర్భాగ్యం. ప్రపంచంలో ఎక్కడ యుద్ధం జరిగినా, యుద్ధంలో ఉండే దేశాలకే కాదు, మిగతా దేశాల మీద కూడా యుద్ధ ప్రభావం పడుతుంది. ఇప్పుడు జరుగుతున్న ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధం తీవ్రరూపం దాల్చిన కొన్ని రోజుల్లోనే భారత్‌లో పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగి, రూపాయి బలహీన పడింది. స్టాక్ మార్కెట్‌లో అస్థిరత వ్యాపించింది. ఇది కేవలం ఒక ఉదాహరణ మాత్రమే. రష్యా- ఉక్రెయిన్ యుద్ధం నుంచి ఎర్ర సముద్రంలో హౌతి దాడుల వరకు యుద్ధం ఎక్కడో జరిగినా భారత్ ఎందుకు ఇబ్బంది పడుతుంది? ఇందుకు కారణం మన ఆర్థిక వ్యవస్థ యొక్క గ్లోబల్ ఇంటిగ్రేషన్. భారత్ ప్రపంచంలో అతిపెద్ద క్రూడ్ ఆయిల్ దిగుమతి దేశాల్లో ఒకటి. మనం 85% కంటే ఎక్కువ క్రూడ్ ఆయిల్ విదేశాల నుంచి తీసుకుంటాం. అందులో ఎక్కువ భాగం మిడిల్ ఈస్ట్, గల్ఫ్ దేశాల నుంచి వస్తుంది. యుద్ధం వల్ల ఆయిల్ ధరలు పెరిగితే మనకు నేరుగా ఇబ్బంది. ఒక బ్యారెల్‌కు ₹10 పెరిగితే భారత్ జీడీపీ గ్రోత్‌లో 20 నుంచి 50 బేసిస్ పాయింట్లు తగ్గిపోతాయని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. ఇటీవల ఇరాన్ యుద్ధం వల్ల బ్రెంట్ క్రూడ్ ₹110కి చేరుకోవడం, ఖతర్ ఎల్‌ఎన్జీ సరఫరా ఆగడం వంటి సంఘటనలు ఇప్పటికే ద్రవ్యోల్బణాన్ని పెంచుతున్నాయి. రెండో ప్రధాన కారణం ఏమిటంటే...వాణిజ్య మార్గాల అంతరాయం. ఎర్ర సముద్రంలో హౌతి దాడుల వల్ల షిప్పింగ్ కంపెనీలు ఆఫ్రికా చుట్టూ (కేప్ ఆఫ్ గుడ్ హోప్) మార్గం మార్చాయి. ఇది ప్రయాణ సమయాన్ని 14-20 రోజులు పెంచి, ఖర్చులు రెట్టింపు చేసింది. భారత్ నుంచి యూరప్, అమెరికాకు కంటైనర్ ఖర్చు ₹600 నుంచి ₹1,500కి పెరిగింది. దీని వల్ల ఎగుమతులు ₹10 బిలియన్ నుంచి ₹30 బిలియన్ వరకు నష్టపోయే అవకాశం ఉంది. బాస్మతి రైస్, ఆభరణాలు, టెక్స్‌టైల్స్ వంటి రంగాలు ఇప్పటికే ఇబ్బందిలో ఉన్నాయి. మూడో కీలక అంశం ఏమిటంటే రెమిటెన్స్ (విదేశీ కార్మికుల నుంచి వచ్చే డబ్బు). గల్ఫ్ దేశాల్లో 9-10 మిలియన్ భారతీయులు పని చేస్తున్నారు. వారు పంపే రెమిటెన్స్ మన దేశ మొత్తం రెమిటెన్స్‌లో 38% వరకు ఉంటుంది. ఇది మన జీడీపీలో 3.5% వరకు సహకరిస్తుంది. యుద్ధం వల్ల ఆయిల్ సర్వీసెస్, కన్‌స్ట్రక్షన్, హోటల్ రంగాల్లో ఉద్యోగాలు పోతే ఈ డబ్బు ప్రవాహం తగ్గిపోతుంది. కరెంట్ అకౌంట్ డెఫిసిట్ పెరగడంతోపాటు కోట్ల మంది కుటుంబాల ఆదాయం కూడా ప్రభావితమవుతుంది. రష్యా-ఉక్రెయిన్ యుద్ధ సమయంలో కూడా ఇదే జరిగింది. సన్‌ఫ్లవర్ ఆయిల్, గోధుమ, ఎరువుల ధరలు పెరిగాయి. భారత్ ప్రపంచంలో అతిపెద్ద ఎడిబుల్ ఆయిల్ దిగుమ తిదారు. ఆ యుద్ధం వల్ల ఆహార ద్రవ్యోల్బణం పెరిగి సాధారణ ప్రజలు కూడా తమ ఖర్చులు తగ్గించుకోవాల్సి వచ్చింది. ఈ సంఘటనలు చూస్తే ఒక విషయం స్పష్టమవుతుంది. భారత్ ఆర్థిక వ్యవస్థ ఇప్పుడు గ్లోబల్ సప్లై చైన్‌లతో బలంగా అనుసంధానమై ఉంది. యుద్ధాలు దూరంగా జరిగినా, ఆయిల్ ధరలు, షిప్పింగ్ ఖర్చులు, కమాడిటీ ధరలు మన దేశంలోకి వెంటనే వస్తాయి. ఇది ద్రవ్యోల్బణం పెంచి, రూపాయి విలువ తగ్గించి, పెట్టుబడులను నిరుత్సాహపరుస్తుంది. ప్రభుత్వం ఇప్పటికే రష్యా నుంచి ఆయిల్ దిగుమతులు పెంచి, స్ట్రాటజిక్ రిజర్వులు నింపుతోంది. ఆయిల్ దిగుమతులను వైవిధ్యపరచడం, స్థానిక ఉత్పత్తి పెంచడం, రెన్యూవబుల్ ఎనర్జీపై దృష్టి పెట్టడం వంటి చర్యలు అవసరం. కానీ, పూర్తి రక్షణ కోసం గ్లోబల్ డిప్లమసీ కూడా కీలకంగా మారుతుంది. యుద్ధాలు మన దేశ సరిహద్దులకు దూరంగా ఉన్నా...వాటి ఆర్థిక షాక్ వేవ్స్ మన ఇంటి వరకు వస్తాయి. ఇది కేవలం ఆర్థిక సమస్య కాదు, లక్షల కుటుంబాల జీవనం, దేశ అభివృద్ధి మార్గంపై ప్రభావం చూపుతు ంది. వీటన్నిటికీ ఒక్కటే పరిష్కారం...ఒక దేశ సార్వభౌ మాధికారం విషయంలో? మరో దేశం జోక్యం చేసకోవద్దు, ఇతర దేశాలతో స్నేహపూర్వక ఒప్పందాలు కొన సాగాలి. అప్పుడే ప్రపంచం శాంతి వర్ధిల్లి, స్థిరమైన ప్రపంచ అభివృద్ధికి మార్గం పడుతుంది.

**గంట సోమన్న, సీనియర్ జర్నలిస్ట్**

# ప్రజాపాలన, ప్రగతి ప్రణాళికతో గ్రామాల అభివృద్ధికి వేగం

**- మంచాల మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేసిన ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి**






**(హైదరాబాద్ ఎస్టేట్ (ప్రతినిధి) మార్చి11:-**మంచాల మండలం: ప్రజల సమస్యలపై క్షణక్షణం స్పందిస్తూ గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని ఇబ్రహీంపట్నం నియోజకవర్గ ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి తెలిపారు. "ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంలో భాగంగా బుధవారం మంచాల మండలంలోని లింగంపల్లి, తాళ్లపల్లి గూడ, చిత్తపూర్, జాపాల్ గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన శంకుస్థాపనలు చేశారు. అనంతరం మంచాల గ్రామంలో గ్రామ సభ నిర్వహించి ప్రజల సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. గ్రామ సభలో ప్రజలు చెప్పిన సమస్యలను వెంటనే సంబంధిత అధికారులను ప్రశ్నించి ప్రజల సమక్షంలోనే పరిష్కరించేందుకు ఎమ్మెల్యే చర్యలు తీసుకున్నారు. ప్రజలతోనే ప్రజాపాలన సాగాలని, ప్రజల వద్దకే పాలన చేరాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తుందని ఆయన పేర్కొన్నారు. ప్రతి ఇంటి సమస్య తెలుసుకుని పరిష్కరించడమే ప్రజాపాలన యొక్క ముఖ్య ఉద్దేశమని అన్నారు.

వేసవి కాలం సమీపిస్తున్న నేపథ్యంలో గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. అధికారులు కార్యాలయాల్లో కాకుండా క్షేత్ర స్థాయిలో తిరిగి ప్రజల సమస్యలను తెలుసుకోవాలని సూచించారు. టెండర్ తీసుకుని పనులను ఆలస్యం చేసే కాంట్రాక్టర్లపై తీవ్రంగా స్పందించిన ఎమ్మెల్యే, పని చేయలేకపోతే వదిలేయాలని, ప్రజలను ఇబ్బంది పెట్టే పరిస్థితిని సహించబోమని హెచ్చరించారు. అసెంబ్లీ సమావేశాల అనంతరం అర్హులైన వారికి నూతన పింఛన్లు మంజూరు చేస్తామని ఆయన తెలిపారు. అలాగే పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువత స్టడీ రూమ్ ఏర్పాటు చేయాలని కోరడంతో వెంటనే ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇండ్లు అందిస్తామని తెలిపారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే పేదలకు రేషన్ కార్డులు, సంక్షేమ పథకాలు అందిస్తున్నామని పేర్కొన్నారు. గత పదేళ్లలో రాష్ట్రాన్ని దోచుకున్న ప్రభుత్వం పేదలకు సరైన సహాయం చేయలేదని ఆయన విమర్శించారు. ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించే ఎమ్మెల్యే తీరుపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు, పలు గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# రంగారెడ్డి జిల్లాలో బ్యాంకింగ్ సేవలపై సమీక్ష

**- వ్యవసాయం, ఎంఎస్ఎంఈ, విద్యా రుణాల**
**- పంపిణీపై చర్చ 2026 27 జిల్లా సంభావ్య క్రెడిట్ ప్రణాళిక ఆవిష్కరణ, బ్యాంకులకు**
**- సూచనలు చేసిన అదనపు కలెక్టర్ కె. శ్రీనివాస్**







**(హైదరాబాద్ ఎస్టేట్ (ప్రతినిధి) మార్చి11:-**జిల్లా వ్యాప్తంగా బ్యాంకింగ్ కార్యకలాపాల పురోగతి మరియు వివిధ ప్రభుత్వ ప్రాయోజిత పథకాల అమలును సమీక్షించడానికి, గౌరవనీయ కలెక్టర్ శ్రీ నారాయణ రెడ్డి సర్ సూచనల మేరకు, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ (ఌఐవీ) రంగారెడ్డి జిల్లాకు చెందిన జిల్లా సంప్రదింపుల కమిటీ (ఌఌఌ) సమావేశాన్ని ఏర్పాటు చేశారు. జిల్లా కలెక్టర్ సూచనల మేరకు, అదనపు కలెక్టర్ వాదీ కె. శ్రీనివాస్ సర్ ఈ సమావేశానికి అధ్యక్షత వహించారు. అన్ని బ్యాంకులు, జిల్లా పరిపాలన, =దీ× చీూదీూ=ఙ అధికారులు సమావేశంలో పాల్గొన్నారు. సమావేశంలో, వివిధ రుణ పథకాల యొక్క వివరణాత్మక సమీక్ష, ముఖ్యంగా వ్యవసాయ అడ్వాన్సులు, మీవీజు అడ్వాన్సులు మరియు విద్యా రుణాల పంపిణీల కింద పురోగతిని చేపట్టారు. మీవీజు యూనిట్లు మరియు విద్యార్థులకు క్రెడిట్‌ను అందించడంలో ఎదురయ్యే సమస్యలను వివరంగా చర్చించారు. క్రెడిట్ ప్రవాహాన్ని మెరుగుపరచడానికి అర్హత కలిగిన రుణాల సకాలంలో మంజూరు పంపిణీని నిర్ధారించడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని బ్యాంకులకు సూచించారు. జిల్లాలో ఆర్థిక చేరికను పెంచడానికి ఆర్థిక అభివృద్ధికి మద్దతు ఇవ్వడానికి బ్యాంకులు మరియు ప్రభుత్వ విభాగాల మధ్య సమన్వయ ప్రయత్నాలను చైర్మన్ నొక్కి చెప్పారు. రుణ ప్రాసెసింగ్‌ను క్రమబద్ధీకరించడానికి క్రెడిట్ డెలివరీలో అడ్డంకులను పరిష్కరించడానికి చర్యలు కూడా చర్చించబడ్డాయి. 2026-27 ఆర్థిక సంవత్సరానికి జిల్లా యొక్క సంభావ్య క్రెడిట్ ప్రణాళికను కూడా సమావేశంలో ఆవిష్కరించారు.

# తెలంగాణ గవర్నర్‌గా శివ ప్రతాప్ శుక్లా ప్రమాణ స్వీకారం





**(హైదరాబాద్ ఎస్టేట్ (ప్రతినిధి) మార్చి11:-**హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర గవర్నర్‌గా శివ ప్రతాప్ శుక్లా పదవీ స్వీకార ప్రమాణం చేశారు. హైదరాబాద్‌లోని లోక్‌భవన్ లో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్, శివ ప్రతాప్ శుక్లాతో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి హాజరై గవర్నర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ముఖ్యమంత్రితో పాటు శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కూడా పాల్గొన్నారు. అలాగే రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ఉన్నతాధికారులు, ఇతర ప్రముఖులు పెద్ద సంఖ్యలో హాజరై కొత్త గవర్నర్‌కు అభినందనలు తెలియజేశారు. కార్యక్రమం గంభీర వాతావరణంలో కొనసాగింది.

ఈ సందర్భంగా రాష్ట్ర అభివృద్ధి ప్రజా సంక్షేమం కోసం గవర్నర్‌గా తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానని శివ ప్రతాప్ శుక్లా తెలిపారు.

# దారుణం: తాగుడుకు బానిసై.. పసిబిడ్డను అమ్మిన కన్నతల్లి




**మెదక్ జిల్లా :**మెదక్ జిల్లాలో దారుణ ఘటన వెలుగులోకి వచ్చింది. హవేలీ ఘనపూర్ మండలం లింగసానిపల్లి తాండాకు చెందిన మంజూల అనే మహిళ మగ శిశువుకు జన్మనిచ్చింది. అయితే మద్యానికి బానిసైన మంజూల దగ్గర తాగడానికి డబ్బులు లేకపోవడంతో ఆమె ప్రియుడు మహిపాల్‌తో కలిసి కన్నబిడ్డను కామారెడ్డి జిల్లాకు చెందిన ఓ దంపతులకు రూ. 1.70 లక్షలకు అమ్మింది. మగశిశువు పుట్టిన వారం రోజులకే ఈ దారుణం జరిగింది. బాలింతకు ఇవ్వాల్సిన ఆహార పదార్థాలు తీసుకోవడానికి ఎవరూ రాకపోవడంతో అంగన్‌వాడీ టీచర్ అనుమానంతో అధికారులకు సమాచారం ఇవ్వగా విషయం వెలుగులోకి వచ్చింది. అధికారులు శిశువును స్వాధీనం చేసుకొని సఖి కేంద్రానికి తరలించారు.

# క్లాసికల్ సింగర్ మాళవిక ఆనంద్ కు సత్కారం




**హైదరాబాద్, మార్చి 11:** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బర్కత్ పుర ప్రాంతానికి చెందిన ప్రముఖ క్లాసికల్ సింగర్ కుమారి మాళవిక ఆనంద్ ను రాష్ట్ర మంత్రి వివేక్ వెంకట స్వామి సతిమణి, ప్రముఖ పారిశ్రామిక వేత్త డాక్టర్ జి.సరోజ వివేక్ అభినందించి సత్కరించారు. ఆధ్యాత్మిక పాటలతో సంగీత ప్రియులను కట్టిపడేస్తూ దేశ, విదేశాల్లో 700లకు పైగా సాంస్కృతిక ప్రదర్శనల్లో మాళవిక ఆనంద్ పాల్గొన్నారు. 9ఏళ్ల వయసులోనే తెలుగు, హిందీ, కన్నడ, తమిళ్ 17 కీర్తనలతో 'శ్రీహరి సంకీర్తనలు' పేరిట అల్బమ్ రూపొందించి అరుదైన రికార్డును సొంతం చేసుకున్న ఘనత మాళవిక ఆనంద్. 2008 సంవత్సరంలో సీడీని రూపొందించిన నాటి నుంచి నేటి వరకు అనేక భాషల్లో పాటలు పాడి పలు ప్రపంచ రికార్డుల్లో తన పేరును నమోదు చేసుకున్నారు. తన ప్రతిభతో 'తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ ' లో మాళవిక పేరు తెచ్చుకుంది. తన గానామృంతంతో సంగీత ప్రియులను విశేషంగా ఆకట్టుకుని అందరిచేత ప్రశంసలు అందుకుంటోంది. కార్యక్రమంలో కెఎం భారతి, వసంత, తదితరులు పాల్గొన్నారు.

RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైద్రాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక

## నైతికత లేని రాజకీయం.. కాంగ్రెస్ తీరుపై ఎంపీ సురేశ్ రెడ్డి ధ్వజం



**హైదరాబాద్, మార్చి11:** రాష్ట్రంలో జరుగుతున్న రాజకీయ పరిణామాలు, ముఖ్యంగా ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపుల వ్యవహారంపై బీఆర్ఎస్ పార్టీ తన గళాన్ని వినిపిస్తోంది. ప్రజాస్వామ్య విలువలను కాపాడాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వం, కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తోందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పార్టీలు మారిన ఎమ్మెల్యేలు తాము ఎవరి గుర్తుపై గెలిచామో, ప్రజలు తమకు ఏ నమ్మకంతో ఓటు వేశారో ఒకసారి ఆత్మ విమర్శ చేసుకోవాలని బీఆర్ఎస్ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఈ సందర్భంగా ఏబీఎన్‌తో మాజీ స్పీకర్, బీఆర్ఎస్ రాజ్యసభ సభ్యుడు కే.ఆర్.సురేశ్ రెడ్డి మాట్లా డుతూ.. 'కాంగ్రెస్ ద్వంద్వ నీతి బయటపడింది.. ప్రభుత్వ స్పీకర్‌పై ఒత్తిడి తెచ్చారు. పార్టీ ఫిరాయింపుల విషయంలో స్పీకర్ నిర్ణయంపై గతంలో మణిపూర్‌లో అసెంబ్లీ కేసులో సుప్రీంకోర్టు జోక్యం చేసుకుంది. 2004లో దానం నాగేందర్ టీడీపీలో గెలిచి కాంగ్రెస్‌కు వస్తే, రాజీనామా చేసి రావాలని చెప్పాను. రాజీనా మా చేశారు, ఆ ఎన్నికల్లో దానం నాగేందర్ ఓడిపోయారు. బీఆర్ఎస్ పార్టీలో ఎమ్మెల్యే అయి, కాంగ్రెస్ ఎంపీగా పోటీ చేశారు, మళ్ళీ ఇప్పుడు బీఆర్ఎస్ ఎమ్మెల్యే అంటున్నారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలు ఆత్మ విమర్శ చేసుకోవాలి. ఒకవైపు దేశ వ్యాప్తంగా 'రాజ్యాంగాన్ని కాపాడుతాం' అని ప్రగల్భాలు పలుకుతూనే, మరోవైపు ఒక్క సభ్యుడిని కాపాడుకోవడం కోసం కాంగ్రెస్ రాజ్యాంగ స్ఫూర్తిని నవ్వులపాలు చేస్తోంది. పార్టీ కండువాలు మార్చుకొని ప్రచారం చేస్తున్న నాయకుల తీరును తెలంగాణ ప్రజలు నిశితంగా గమనిస్తున్నారు.

# లోక్‌సభలో తెలంగాణకు అవమానం ఏపీ టీడీపీ ఎంపీ వివాదాస్పద వ్యాఖ్యలు

**హైదరాబాద్ :** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విడిపోయి ఆంధ్ర ప్రదేశ్, తెలం గాణగా ఏర్పడి 12 ఏళ్లు పూర్తి అయింది. ఈ సందర్భంగా పార్ల మెంటు బడ్జెట్ సమావేశాల సందర్భంగా మాట్లాడిన టీడీపీ నేత, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు రెండు రాష్ట్రాల మధ్య తీవ్ర వివాదానికి కారణం అయ్యా యి. లోక్‌సభలో జరిగిన చర్చలో పాల్గొన్న ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు.. ఆంధ్రప్రదేశ్ పునర్వ్య వస్థీకరణ చట్టంపై మాట్లా డుతూ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారాయి. ఈ క్రమం లోనే 2014 ఫిబ్రవరి 14వ తేదీని బ్లాక్ డేగా ఎంపీ లావు అభివ ర్ణించడంపై.. బీఆర్ఎస్ నేతలు తీవ్రంగా స్పందిస్తున్నారు. అయితే తన వ్యాఖ్యలు తీవ్ర వివాదానికి దారితీయడంతో ఎట్టకేలకు ఆయ న స్పందించారు. పార్లమెంటులో ఆంధ్రప్రదేశ్ ఎంపీలు చేసిన వ్యాఖ్యలపై ఎక్స్ వేదికగా స్పందించిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్.. ఏపీ ఎంపీలు తెలంగాణపై ఏడుపు ఆపాలని హెచ్చరించారు. రాష్ట్రం విడిపోయి 12 ఏళ్లు గడుస్తున్నా తెలంగాణపై ఏపీ నేతలు విషం చిమ్మడం మాత్రం ఆపడం లేదని విమర్శించారు. తెలంగాణ అస్తిత్వాన్ని లోక్‌సభ వేదికగా కించపరిచేలా



ఎంపీ లావు మాట్లాడారని దాసోజు శ్రవణ్ మండిప డ్డారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అభివృద్ధి చెందడానికి ఏం కావాలో కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వాన్ని అడిగే తెలివి లేక.. తెలంగాణపై పడి ఏడవడం వారికి అలవాటుగా మారి పోయిందని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అనవసరంగా తెలంగాణ జోలికి వచ్చి తమ ప్రజలను అవమానించినా.. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును కించ పరిచే విధంగా మాట్లాడితే మాత్రం తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు.ఇక తెలంగాణపై తాను చేసిన వ్యాఖ్యలు ఇంతటి వివాదానికి కారణం కావడంతో ఎంపీ లావు శ్రీకృష్ణదేవరా యలు క్లారిటీ ఇచ్చారు. బుధవారం మీడి యాతో మాట్లాడిన ఎంపీ లావు.. చలేదని తేల్చి చెప్పారు. అదే సమయంలో తెలంగాణ రాష్ట్రాన్ని కిం చపరిచేలా కూడా ఏం ఇచ్చారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన బిల్లు ఆమోదం పొందే సమయంలో అప్పటి లోక్‌సభ స్పీకర్‌గా ఉన్న మీరా కుమార్ తీరుపై మాత్రమే తాను మాట్లాడినట్లు చెప్పారు. ఆ సమ యంలో లోక్‌సభ స్పీకర్ మీరా కుమార్ రూల్స్ అతిక్ర మించేలా వ్యవహరించారని మాత్రమే తాను పేర్కొన్నట్లు క్లారిటీ ఇచ్చారు. అదే సమయంలో తాను చేసిన వ్యాఖ్యలను వక్రీక రించి.. మళ్లీ తెలంగాణ, ఏపీ సెంటిమెంట్‌ను రాజేయ వద్దని బీఆర్ఎస్ నేతలకు ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు సూచించారు.

## తెలంగాణకు పూర్తికాలపు డిజిపి రేసులో సీవీ ఆనంద్, మరో ఇద్దరు మహిళా ఐపీఎస్‌లు

తెలంగాణకు ఇప్పటి వరకు పూర్తికాలపు డీజీపీ లేరు. ప్రస్తుతం శివధర్ రెడ్డి ఇంఛార్జ్ డీజీపీగానే కొనసాగుతున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రానికి పూర్తికాలపు డీజీపీ ఎంపిక ప్రక్రియ చివరి దశకు చేరుకుంది. యూపీఎస్సీ నేతృత్వంలోని కమిటీ ముగ్గురు అర్హత కలిగిన సీనియర్ ఐపీఎస్‌ల జాబితాను ఖరారు చేసేందుకు నేడు సమావేశం కానుంది. యూపీఎస్సీ ఛైర్మన్ అధ్యక్షతన జరిగే ఈ భేటీకి కేంద్ర హోంశాఖ కార్యదర్శి, కేంద్ర సాయుధ పోలీస్ బలగాల హెడ్, రాష్ట్రం నుంచి సీఎస్ రామకృష్ణారావు సభ్యుల హోదాలో అటెండ్ కానున్నారు. తెలంగాణకు పూర్తికాలపు డీజీపీ లేకపోటవంతో డీజీపీ ఎంపికకు తుది జాబితాను యూపీఎస్సీకి పంపించాలని సుప్రీంకోర్టు గత నెల 5న రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది.ఈ క్రమంలోనే గత నెల 23న రేవంత్ సర్కార్ అర్హుల జాబితాను పంపించింది. ఈ జాబితా ఐదుగురి పేర్లతో ఉన్నట్లు తెలిసింది. ప్రస్తుత డీజీపీ శివధర్‌రెడ్డితో పాటు, 1991 బ్యాచ్‌కు చెందిన సీవీ ఆనంద్ , 1994 బ్యాచ్‌కు చెందిన వినాయక్ ప్రభాకర్‌ఆప్టే, శిఖాగోయెల్, సౌమ్యమిశ్రా తెలంగాణ క్యాడర్‌లో డీజీపీ హోదా కలిగిన ఐపీఎస్‌లుగా ఉన్నారు. వీరి



పేర్లను యూపీఎస్సీకి పంపించినట్లు సమాచారం. నేటి యూపీఎస్సీ కమిటీ భేటీలో వీరిలో ముగ్గురి పేర్లను ఖరారు చేయనున్నట్లు తెలిసిందే. సీనియారిటీ, మెరిట్ ఆధారంగా ఎంపికయ్యే వారి జాబితాను యూపీఎస్సీ రాష్ట్ర ప్రభుత్వానికి పంపించనుండగా.. వారిలో నుంచి రాష్ట్ర ప్రభుత్వం ఒకరిని డీజీపీగా ఎంపిక చేయనుంది.ప్రస్తుతం హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్య దర్శిగా ఉన్న సీవీ ఆనంద్ అందరికంటే సీనియర్. ఆ తర్వాత 1994 బ్యాచ్‌కు చెందిన ప్రస్తుత ఇన్‌చార్జి డీజీపీ శివధర్ రెడ్డి, టీజీ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్‌గా పని చేస్తున్న శిఖా గోయల్, జైళ్లశాఖ డీజీగా పని చేస్తున్న సౌమ్యా మిశ్రా, కేంద్ర సర్వీస్‌లో ఇం టెలిజెన్స్ బ్యూరో స్పెషల్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న వినాయక్ ప్రభాకర్ ఆప్టే ఉన్నారు. సీనియర్ ఐపీఎస్ అయిన సీవీ ఆనంద్ వైపు రేవంత్ ప్రభుత్వం మొగ్గు చూపుతుందా..? మహిళకు ఆ పోస్టు ఇస్తారా అనేది చర్చనీయాంశంగా మారింది.మహిళకు ఛాన్స్ ఇవ్వాలనుకుంటే శిఖా గోయల్, సౌమ్యా మిశ్రాలలో ఒకరికి అవకాశం దక్కనుంది. రాష్ట్రానికి మహిళా అధికారి ఎవరూ డీజీపీ కాలేదని.. తనకు ఆ అవకాశం ఇవ్వాలని శిఖా గోయల్ కోరుతున్నట్లు తెలిసింది. పూర్తిస్థాయి డీజీపీగా నియమితులయ్యే వారు కనీసం రెండేళ్లపాటు ఆ పదవిలో కొనసాగనుండటంతో పోలీస్ బాస్ పోస్టుకు ప్రాధాన్యత ఏర్పడింది.

## స్పీకర్ నిర్ణయం శాసన వ్యవస్థ చరిత్రలో చీకటి రోజు



**హైదరాబాద్ :** పార్టీ ఫిరాయింపుల కేసులో ఎమ్మెల్యేలు దానం నాగేందర్ , కడియం శ్రీహరి(కి స్పీకర్ క్లిన్ చిట్ ఇవ్వడం ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ స్ఫూర్తి ని అపహాస్యం చేసినట్టే అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. స్పీకర్ నిర్ణయం శాసన వ్యవస్థ చరిత్రలో చీక టి రోజుగా మిగిలిపోతుందని విమర్శించారు. ప్రజలు ఒక పార్టీ గుర్తుపై ఓటు వేసి గెలిపించిన ప్రజాప్రతినిధులు తర్వాత అధికారంలో ఉన్న పార్టీలో పనిచేయడం ప్రజల తీర్పును తుంగలో తొక్కినట్టేనని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేగా ఉంటూ కాంగ్రెస్ పార్టీ బీఫామ్‌పై ఎంపీగా పోటీ చేసిన దానం నాగేందర్‌కు స్పీకర్ క్లిన్ చిట్ ఇవ్వడం అంటే ప్రజాస్వామ్యానికి తూట్లు పొడిచి, ప్రజల తీర్పును పూర్తిగా అవమానించినట్టేనని వేముల ప్రశాంత్ రెడ్డి విమర్శించారు.కడియం శ్రీహరి కూతురు కాంగ్రెస్ టికెట్‌పై ఎంపీగా ఎన్నికల్లో పోటీ చేసిన విషయం అందరికీ తెలిసిందేనని గుర్తుచేశారు. కడియం శ్రీహరి స్వయంగా కాంగ్రెస్ కండువా వేసుకుని తన కూతురు తరపున ఎన్నికల ప్రచారం చేయడమే కాకుండా, ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ బీఫామ్‌పై పోటీ చేసిన అభ్యర్థుల తరపున బహిరంగంగా ప్రచారం చేసిన విషయం ప్రజలు ప్రత్యక్షంగా చూశారని తెలిపారు.

## రాబోయేది మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వమే



**దేవరకొండ, మార్చి 11 :** తెలంగాణ రాష్ట్రంలో రాబోయేది మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, కేసీఆర్ తిరిగి ముఖ్యమంత్రి కావడం ఖాయం అని ఈ విషయం కాంగ్రెస్ పార్టీ నాయకులే అనుకుంటున్నరని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్ రెడ్డి అన్నారు. బుధవారం దేవరకొండ పట్టణంలోని శివ సాయి ఫంక్షన్ హాల్‌లో చందంపేట మండలం నుండి మాజీ ఎంపీపీ ముత్యాల సర్వయ్య ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు సుమారు 500 మంది బీఆర్ఎస్‌లో చేరారు. దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రవీంద్ర కుమార్ సమక్షంలో వీరందరికి జగదీశ్‌రెడ్డి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలం అయిందన్నారు.6 గ్యారంటీల్లో ఏ ఒక్క హామీ నెరవేర్చలేదని తెలిపారు. కేటీఆర్ ఎక్కడ సమావేశం నిర్వహించిన ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. ప్రజలు మళ్లీ కేసీఆర్ పాలన కోరుకుంటున్నట్లు చెప్పారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికలో దేవరకొండలో గులాబీ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు గాజులు ఆంజనేయులు, బిల్యా నాయక్, రమేశ్ నాయక్, కిషన్ నాయక్, టీవీఎన్ రెడ్డి, ముత్యాల శరవయ్య, లోక్య నాయక్, వెంకట్ రెడ్డి, వల్లపు రెడ్డి, ప్రవీణ్ రెడ్డి, సుభాష్ గౌడ్, శంకర్ నాయక్, శ్రీనివాస్ గౌడ్, చంద్ర శేఖర్, రవి, నీలా రవి, రూప్లే నాయక్, అంజి గౌడ్, హరీలాల్, భవాని, చంద్ర కళ, మధు, మురళి, బాలయ్య, మోహన్ కృష్ణ, మహేశ్

# వండి పెట్టలేం ప్రత్యామ్నాయం చూసుకోండి హైదరాబాద్ హాస్టళ్లలో వంట గ్యాస్ కష్టాలు

**హైదరాబాద్ :** పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలు హైదరాబాద్ నగరంలోని ఐటీ నిపుణులు, విద్యార్థుల కడుపు కొడుతున్నాయి. అమెరికా, ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య కొనసాగుతున్న యుద్ధం కారణంగా ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ల సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో గచ్చిబౌలి ఐటీ కారిడార్ కేంద్రంగా పనిచేస్తున్న 'ఐటీ కారిడార్ హాస్టల్ అసోసియేషన్' కీలక నిర్ణయం తీసుకుంది. గ్యాస్ వాడకాన్ని తగ్గించేందుకు మెనూలో భారీ మార్పులు చేస్తూ హాస్టల్ యజమానులకు అత్యవసర మార్గదర్శకాలను విడుదల చేసింది. సిలిండర్ల కొరత తీరేవరకు పొదుపుగా వంట చేయాలని అసోసియేషన్ సూచించింది. అందులో భాగంగా ఎక్కువ సమయం, అధిక ఆయిల్ వినియోగించే చపాతీ, పూరీ, దోశ వంటి టిఫిన్లను తాత్కాలికంగా నిలిపివేయాలని సూచించింది. ఉదయం, సాయంత్రం అందించే టీ, కాఫీలను కూడా ప్రస్తుతానికి సర్వ్ చేయటం కుదరదన్నారు. కేవలం అన్నం, పప్పు వంటి భోజనం మాత్రమే అందుబాటులో





ఉంటుందని.. గ్యాస్ కొరత తీవ్రతను బట్టి కొన్ని రకాల కూరలు, స్పెషల్ ఐటమ్స్‌ను కూడా బంద్ చేయనున్నట్లు వెల్లడించారు. హాస్టళ్లలో విద్యార్థులు, ఉద్యోగులు సొంతంగా వంట చేసుకోవడానికి వీల్లేదని, అటువంటి సదుపాయాలను తాత్కాలికంగా ఆపేస్తున్నట్లు ప్రకటించారు.గ్యాస్ కొరతను అధిగమించేందుకు ప్రత్యామ్నాయ వంట పద్ధతులను ఇండక్షన్ లేదా ఇతర మార్గాలను అనుసరించాలని అసోసియేషన్ హాస్టల్ యజమానులను కోరింది. ప్రస్తుత పరిస్థితిని గమనించి హాస్టళ్లలో ఉంటున్న వారు సహకరించాలని విజ్ఞప్తి చేసింది. ఈ నిర్ణయంపై హాస్టళ్లలో ఉండే వేలాది మంది సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే పెరిగిన మెస్ ఛార్జీలతో ఇబ్బంది పడుతుంటే.. ఇప్పుడు కనీసం నచ్చిన ఆహారం కూడా దొరకడం లేదని ఆవేదన చెందుతున్నారు.కాగా, గ్యాస్ సరఫరా సాధారణ స్థితికి వచ్చే వరకు ఈ ఇబ్బందులు తప్పేలా కనిపించటం లేదు. మెట్రో నగరాలైన బెంగళూరు, ముంబైలలో ఇప్పటికే హోటళ్లను మూసేశారు. కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల కొరత ఏర్పడటంతో వండిపెట్టలేని పరిస్థితి ఏర్పడుతోంది. హైదరాబాద్ నగరంలోనూ చాలా హోటళ్లు మెనూ తగ్గించాయి. పూరీ, వడ, దోశ వంటి వంటకాలను నిలిపివేశారు. తక్కువ గ్యాస్ వినియోగం అయ్యే ఆహారపదార్థాలు మాత్రమే అందుబాటులో ఉంచున్నారు.

# కడియం, దానంలకు బిగ్ రిలీఫ్.. ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లు కొట్టేసిన స్పీకర్

తెలంగాణ రాజకీయాల్లో ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపు అనర్హత పిటిషన్లు హాట్ టాఫిక్‌గా మారిన సంగతి తెలిసిందే. ఇప్పటికే 8 మంది ఎమ్మెల్యేలకు స్పీకర్ క్లీన్ చిట్ ఇవ్వగా.. తాజాగా ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కూడా ఊరట దక్కింది. పిటిషన్లపై విచారణ జరిపిన అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ వారు పార్టీ మారినట్లు సరైన ఆధారాలు లేవంటూ వాటిని డిస్మిస్ చేశారు. దీంతో ఇద్దరు ఎమ్మెల్యేలకు బిగ్ రిలీఫ్ దక్కినట్లయింది. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు.. మార్చి 12లోగా అనర్హత పిటిషన్లపై స్పీకర్ విచారణ చేసి తుది నిర్ణయాన్ని ప్రకటించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో గతంలో ఎనిమిది మంది ఎమ్మెల్యేలు, తాజాగా ఇద్దరితో కలిపి మట్టొత్తం 10 మంది ఎమ్మెల్యేలకు ఊరట లభించింది.2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ గుర్తుపై గెలిచిన 10 మంది ఎమ్మెల్యేలు ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీకి దగ్గరయ్యారు. వారిలో దానం నాగేందర్, కడియం శ్రీహరి, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, ఎం. సంజయ్ కుమార్, గూడెం మహిపాల్ రెడ్డి, టి. ప్రకాశ్ గౌడ్, కాలెయాదయ్య, అరికెపూడి గాంధీ, తెల్లం వెంకట్రావు, పోచారం శ్రీనివాస్ రెడ్డి ఉన్నారు. సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో పార్టీ మారినట్లు మీడియాలో కథనాలు రావటంతో వారిపై అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ సభ్యులు పాడి కౌశిక్ రెడ్డి, కేపీ వివేకానంద మరికొందరు సభ్యులు స్పీకర్‌కు ఫిర్యాదు చేశారు. స్పీకర్ సకాలంలో చర్యలు తీసుకోకపోవటంతో తెలంగాణ హైకోర్టు, ఆ తర్వాత సుప్రీం కోర్టులోనూ పిటిషన్లు దాఖలు చేశారు. దీంతో సుప్రీం కోర్టు స్పీకర్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ మార్చి 12లోగా విచారణ జరిపి నిర్ణయాన్ని





వెల్లడించాలని స్పష్టం చేసింది. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు గతంలోనే 8 మంది ఎమ్మెల్యేలకు క్లీన్ చిట్ ఇచ్చిన స్పీకర్ తాజాగా.. దానం, కడియంలపై ఇచ్చిన పిటిషన్లను సైతం కొట్టేశారు.అయితే వీరిలో దానం నాగేందర్ 2024 పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా సికింద్రాబాద్ స్థానం నుంచి పోటీ చేసి ఓడిపోయారు. దీంతో ఆయన పార్టీ మారినట్లు స్పష్టమైన ఆధారాలు ఉన్నాయని.. చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు డిమాండ్ చేస్తూ వచ్చారు. కానీ స్పీకర్ మాత్రం అనుహ్యంగా దానం నాగేందర్‌కు సైతం క్లీన్ చిట్ ఇచ్చారు. దీనిపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు మండిపడుతున్నారు. ప్రజాస్వామ్యంలో ఇది చీకటి రోజని అంటున్నారు. వాళ్లు పార్టీ మారకపోతే బీఆర్ఎస్ భవన్‌కు రావాలని సవాల్ విసురుతున్నారు. కాగా, స్పీకర్ నిర్ణయంపై దానం హర్షం వ్యక్తం చేశారు. గత ఆరు నెలలుగా తనను మానసిక క్షోభకు గురిచేశారని అన్నారు. తాను సికింద్రాబాద్ నుంచి కాంగ్రెస్ గుర్తుపై పోటీ చేయటం పూర్తిగా తన వ్యక్తిగతమని అన్నారు. ప్రాథమిక హక్కును ఉపయోగించుకోనే పోటీలో నిలిచినట్లు చెప్పుకొచ్చారు.

## పరిగి బీజేపీ సారథి ఎవరు



**పరిగి(వికారాబాద్):** పరిగి అసెంబ్లీ నియోజకవర్గంలో బీజేపీకి నాయకత్వ లోపం ఏర్పడింది. దేశంలో ఆ పార్టీకి అనుకూల పవనాలున్నా పరిగిలో మాత్రం పార్టీని నడిపే నాయకుడు లేకుండా పోయాడు. పార్టీలో ఏళ్లనుంచి కొనసాగుతున్న కార్యకర్తలు అయోమయంలో పడ్డారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో పెద్దగా ప్రచారం చేయకపోయినా కమలం గుర్తు 16వేలకుపైగా ఓట్లు సాధించించింది. లోక్‌సభ ఎన్నికల్లో నియోజకవర్గంలో కాంగ్రెస్ కంటే బీజేపీ ఎక్కువ ఓట్లు సాధించింది. ఇటీవలి పురపాలక ఎన్నికల్లోనూ ఉనికి చాటింది. రెండు వార్డుల్లో గట్టి పోటీనిచ్చింది. కొందరు అభ్యర్థులు స్వల్ప ఓట్లతో ఓడారు. పోలైన ఓట్లలో తొమ్మిది శాతం(1,659) సాధించింది. అయితే నాయకత్వలోపం సమస్యగా మారిందని కార్యకర్తలు అంటున్నారు. గతంలో ఎప్పుడూ బీజేపీకి అసెంబ్లీ ఎన్నికల్లో పది వేలలోపే ఓట్లు పడేవి. అయితే క్రమంగా పార్టీ బలపడుతున్న సూచనలు కన్పిస్తున్నాయి.పార్టీ జిల్లా కన్వీనర్‌గా కొనసాగుతున్న కరణం ప్రహ్లాద్‌రావు పరిగికి చెందినాయనే. అయితే ఆయన పరిగిపై దృష్టి సారించడం లేదు. చేవెళ్ల ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి సైతం తన పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో పరిగిని పట్టించుకోవడం లేదని శ్రేణులు అసంతృప్తితో ఉన్నాయి. నడిపించే నాయకుడు లేకుంటే పార్టీ ఎలా అభివృద్ధి చెందుతుందని ప్రశ్నిస్తున్నారు. ఒకవైపు నాయకత్వ లోపం, మరోవైపు ద్వితీయ శ్రేణి నాయకుల్లో గ్రూపులతో పార్టీకి నష్టం జరుగుతుంది. చాలా ఏళ్లుగా పరిగిలో సీనియర్ నేత కరణం ప్రహ్లాద్‌రావు పార్టీకి పెద్దదిక్కుగా కొనసాగారు.

Printed, Published & Owned by BATTU LAXMI NARAYANA ; Printed at BATTU PRINTERS, PLOT NO 30, ROAD NO 2, MADHRA NAGAR, MANSURABAD, LBNAGAR R R DIST, TELANGANA.
Published from BATTU.PUBLICATIONS, H.NO PLOT NO 30 ,ROAD NO 2, MADHRA NAGAR, MANSURABAD ,LBNAGAR, R R DIST. Editor: BATTU LAXMI NARAYANA, CELL:9951693876